RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 320 మేడ్చల్ మల్కాజ్‌గిరి 11 డిసెంబర్ 2024 బుధవారం పేజీలు : 4

### ఇండో-చైనా బలగాల ఉపసంహరణ శుభపరిణామం

బ్రిస్బేన్: తూర్పు లద్దాఖ్‌లోని డెమ్‌చోక్, డెస్పాంగ్ నుంచి భారత్-చైనా బలగాల ఉపసంహరణ స్వాగతించదగని పరిణామమని భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ అన్నారు. బ్రిస్బేన్‌లో భారత సంతతి ప్రజలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 2020 జూన్‌లో గల్వాన్ లోయలో ఘర్షణల అనంతరం తలెత్తిన ప్రతిష్టంభన తొలగిం చడంలో ఇరుదేశాల కొంత పురోగతి సాధించినట్టు చెప్పారు. "ఇరుదేశాల సంబంధాల విషయంలో కొంత ప్రగతిని మేము సాధించాం. మేము మాత్రం బలగాల ఉపసంహరణ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. మరిన్ని చర్యల దిశగా అడుగువేసేందుకు అవకా శాలు తెరుచుకున్నాయని భావిస్తున్నాం" అని జైశంకర్ చెప్పారు.



# బీఆర్ఎస్ టూ కాంగ్రెస్

# ఇక వలసల వరదే...!

## పిలవండి..వచ్చేస్తాం.. గులాబీల సందేశం!?

హైదరాబాద్ : పార్టీ మారాలనుకునే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇదే మంచి సమయం అని భావిస్తున్నారా? అధికార పార్టీలో ప్రాధాన్యత దక్కాలంటే ఇంతకంటే మంచి సమయం దొరకదని లెక్కలు కడుతున్నారా? పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై హైకోర్టు ఆదేశాలతో ఇక చేరికలు లేనట్లేనని భావిస్తుండగా... కాంగ్రెస్ తో టచ్ లోకి ఎమ్మెల్యేలు వెళ్లారా? అంటే అవుననే అంటున్నాయి గాంధీ భవన్ వర్గాలు. కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు డజన్ మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు ఆదేశాలతో కారు దిగిన ఎమ్మెల్యేలపై అనర్హత కత్తి వేలడుతున్నా... ఈ అనర్హత వేటు నుంచి తప్పించేందుకు బీఆర్ఎస్ ఎల్పీ విలీనం దిశగా కాంగ్రెస్ ప్రయత్నాలు మొదలు పెట్టిందా? అనేది స్పష్టత లేదు. కానీ, కారు దిగి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకొని ఆశాకిరణంలా నిలిచేందుకు ఎమ్మెల్యేలు ఆసక్తి చూపిస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. బీఆర్ఎస్ లో కొనసాగితే రాజకీయ భవిష్యత్ ఉండదని ..కాంగ్రెస్ లో చేరేందుకు కొంతమంది ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో కాంగ్రెస్ లో చేరాలంటే మంత్రి పదవులు కావాలని షరతులు విధించిన ఎమ్మెల్యేలు..మారిన రాజకీయ పరిణామాలతో మంత్రి పదవి అక్కర్లేదు..పార్టీలో చేర్చుకోండి అంటూ కబురు పంపుతున్నట్లు జోరుగా ఊహాగానాలు చెలరేగుతున్నాయి. కాంగ్రెస్ లో ఇప్పుడు చేరితేనే ప్రాధాన్యత ఉంటుందని.. చేరికలు ఆ పార్టీకి ఇప్పుడు కీలకమని... అందుకే ఈ టైమ్ ను పక్కాగా వాడుకోవాలని ఫిక్స్ అయ్యారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అయితే, ఇదంతా ప్రచారమేనా.. బీఆర్ఎస్ ను డిఫెన్స్ లో పడేసేందుకు కాంగ్రెస్ వ్యూహాత్మకంగా ఈ ప్రచారం ఏమైనా మొదలు పెట్టిందా? లేక డజన్ మంది ఎమ్మెల్యేలు నిజంగానే కాంగ్రెస్ తో టచ్ లోకి వెళ్లారా అని రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చే నడుస్తోంది.

# సంక్రాంతికి సన్నబియ్యం ఇచ్చేనా?



## సన్నబియ్యం పంపిణీపై ప్రజల్లో సందేహాలు



హైదరాబాద్ : ఒక్కో పథకాన్ని అటకెక్కిస్తూ.. ఒక్కో హామీకి తిలోదకాలిస్తూ పాలన సాగిస్తున్న కాంగ్రెస్ సర్కారు మరో స్కీమ్‌కు రాంరాం చెప్పేందుకు సిద్ధమైనట్టు కనిపిస్తున్నది. సంక్రాంతి నుంచి రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పలు సందర్భాల్లో ఆర్భాటంగా ప్రకటించారు. కానీ ప్రకటనలకు అనుగుణంగా పని మాత్రం కావడం లేదని సమాచారం. సన్నబియ్యం పంపిణీకి పౌరసరఫరాలశాఖ కనీస చర్యలు కూడా ప్రారంభించలేదని తెలుస్తున్నది. మంత్రులు ఇచ్చిన హామీ ప్రకారం సన్న బియ్యం పంపిణీకి మరో నెల రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. కానీ ఇప్పటివరకు సన్న బియ్యం అస్సలే సేకరించలేదు. మరో ఆరు నెలలకు అవసరమైన దొడ్డు బియ్యం సేకరణ కోసం అధికారులు మిల్లర్లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇప్పట్లో సన్న బియ్యం పంపిణీ లేనట్లేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**సన్న బియ్యం లేకపోవడంతోనేనా?...** సన్న బియ్యం పంపిణీపై ప్రభుత్వ పెద్దల ఆలోచన బెడిసికొట్టిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సన్న ధాన్యానికి బోన స్ ఇస్తున్నందున అధిక విస్తీర్ణంలో సన్నాలు సాగవుతాయని, వాటి ద్వారా సన్న బియ్యం ఇవ్వొచ్చని ఆలోచించినట్టు తెలుస్తున్నది. ఇందుకు విరుద్ధంగా పౌరసరఫరాల సంస్థకు సన్నాలు రాకపోవడంపై అధికారుల్లో అంతర్మథనం మొదలైంది. వాస్తవానికి సన్న బి య్యం పంపిణీకి ఏటా 24లక్షల టన్నుల బి య్యం, 36లక్షల టన్నుల ధాన్యం అవసరం. కానీ ఇప్పటివరకు సివిల్ సైప్లై సంస్థ 10 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది. ఇంకో 5లక్షల టన్నులు రావొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన మరో 20 లక్షల టన్నుల ధాన్యం తక్కువ పడుతున్నది. ఇంత భారీస్థాయిలో సన్న బియ్యాన్ని బయ ట కొనుగోలు చేసి పంపిణీ చేస్తే సివిల్ సైప్లైపై భారీ ఆర్థిక భారం పడుతుంది. ఈ నేపథ్యంలో రేషన్‌లో సన్న బియ్యం పంపిణీ వాయిదా వేసినట్టు తెలుస్తున్నది.



## రాహుల్‌జీ మీరు చేసింది సరైనదైతే.. మిమ్మల్ని అనుసరించిన మాకెందుకు అనుమతి లేదు..?

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. అదానీ వ్యతిరేక నిరసనల్లో కాంగ్రెస్ ద్వంద్వవైఖరి పాటిస్తోందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్‌లో ఒకలా, తెలంగాణ అసెంబ్లీలో మరోలా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

'రాహుల్ జీ ఇది ఎలాంటి వంచన..? పార్లమెంట్‌లో అదానీ - మోదీ ఫొటో ఉన్న టీషర్ట్ ధరించడం మీకు సరైనదే అయితే.. మీ అడుగుజాడల్లో నడిచి తెలంగాణ అసెంబ్లీలో అదానీ - రేవంత్ వ్యవహారాన్ని బయటపెట్టడానికి మాకు ఎందుకు అనుమతి లేదు..? దీనికి సమాధానం చెప్పండి' అంటూ కేటీఆర్ నిలదీశారు. ఈ మేరకు రాహుల్.. మోదీ %-% అదానీ చిత్రాలతో ఉన్న టీషర్ట్‌లను ధరించిన ఫొటోలను ట్వీట్‌కు జతచేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది.




# సారు... ఇప్పట్లో వచ్చేలా లేరే...!

## అసెంబ్లీకి కేసీఆర్ మళ్లీ డుమ్మా..

## రాష్ట్రవ్యాప్తంగా జోరుగా ఇదే చర్చ!!

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలు రసవత్తరంగా నడుస్తున్నాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య రోజురోజుకూ భగ్గుమనేలా విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగా.. ప్రధాన ప్రతిపక్ష నేత పాత్ర పోషించాల్సిన కేసీఆర్ మరోసారి డుమ్మా కొట్టారు. ఇప్పుడు దీనిపై రాష్ట్రవ్యాప్తంగా మరోసారి చర్చకు దారితీసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తిచేసుకుంది. పదేళ్లపాటు రాష్ట్రాన్ని బీఆర్ఎస్ నేతలు పాలించారు. రాష్ట్రం ఏర్పాటు నుంచి గులాబీ పార్టీనే అధికారంలో కొనసాగింది. దాంతో రెండు పర్యాయాలు కూడా ముఖ్యమంత్రిగా కేసీఆరే బాధ్యతలు చేపట్టారు. పదేళ్ల పాలనపై అసంతృప్తితో ఉన్న ప్రజలు గత అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ పార్టీకి చేదు ఫలితాలను ఇచ్చారు. దాంతో అధికారంలో కోల్పోయి బీఆర్ఎస్ ప్రతిపక్ష పార్టీగా పాత్ర పోషించాల్సి వచ్చింది. అయితే.. ప్రజాతీర్పును గౌరవించి ప్రతిపక్ష పాత్రను పోషించాల్సిన బీఆర్ఎస్ అధినేత, మాజీముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి వచ్చేందుకు ముఖం చాటేస్తున్నారు. ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసి.. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా ఫాంహౌజ్‌కే పరిమితం అవుతున్నారు. ఇప్పటికే చాలా సందర్భాల్లోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక అప్పీల్ చేశారు. సీనియర్ నాయకుడైన మీరు అసెంబ్లీకి వచ్చి తమకు సూచనలు ఇవ్వాలని.. తమ పాలనను ముందుకు నడిపించాలని కోరారు. విలువైన సూచనలతో ప్రజల సమస్యలను మరింత దూరం చేయొచ్చని పేర్కొన్నారు. అసెంబ్లీ రండి.. వచ్చి మమ్మల్ని ఇరుకున పెట్టండి.. నిలదీయండి అని కూడా కోరారు. కానీ.. కేసీఆర్ మాత్రం ఎప్పటిలాగే.. ఈ సారి కూడా అసెంబ్లీ సమావేశాల్లో కనిపించలేదు. ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని చూస్తున్నట్లుగా బీఆర్ఎస్ వర్గాలు చెబుతూ వచ్చాయి. అందుకే కేసీఆర్ ప్రజల్లోకి రావడం లేదని అన్నారు. మరి.. కాంగ్రెస్ కొలువుదీరి కూడా ఏడాది సమయం గడిచింది. ఇప్పటికి కూడా ఎందుకు రావడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏడాది కాలంలో బడ్జెట్ సమావేశాల వేళ ఒక్క రోజు మాత్రమే ఆయన అసెంబ్లీకి వచ్చి వెళ్లారు. అది కూడా చుట్టపుచూపుగా అలా వచ్చి.. ఇలా వెళ్లిపోయారు. ఇక అప్పటి నుంచి ఇటు అసెంబ్లీకి కానీ.. అటు ప్రజల్లోకి కానీ రావడం లేదు. తాజాగా.. అసెంబ్లీ సమావేశాల్లో రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై కీలక చర్చ పెట్టారు. ఏడాది పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా అసెంబ్లీ సమావేశాలు ఏ విధంగా జరుగుతాయో అని అందరూ అనుకున్నారు. ఈ క్రమంలోనే ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు రాకపోవడంపై జోరుగా చర్చ మొదలైంది. మరోవైపు.. కేసీఆర్ ఎప్పుడు అసెంబ్లీకి వస్తారా..? ఎప్పుడు దుమ్మదులుపుదామా అన్నట్లుగా రేవంత్ ఎదురుచూస్తున్నట్లు అర్థమవుతోంది. కానీ రేవంత్ రెడ్డికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈసారి కూడా ఆ చాన్స్ ఇవ్వలేదు. ముందుముందు కూడా ఆయన అసెంబ్లీ సమావేశాలకు వస్తారా లేదా అన్నది కూడా అనుమానంగానే ఉంది.

# సంపాదకీయం

## షర్మిల బాణాలు గురితప్పుతున్నాయా ..!

ఎంత వరకు ఏ పాత్ర పోషించాలో.. అంత వరకు పోషిస్తే... రక్తికడుతుంది... రంజుగా ఉంటుంది... రాణిస్తుంది కూడా! మోతాదు మించితే మాత్రం వెగటు పుడుతుంది.. వెక్కిరింత కూడా అవుతుంది. ఈ విషయం రాజకీయాల్లో ఉన్నవారు చాలా జాగ్రత్తగా పరిశీలించుకోవాలి. అంతర్మథనం చేసుకోవాలి. ఈ రెండు చేయకపోతే.. ఇబ్బందులు తప్పవు. ఇప్పుడు ఏపీ కాంగ్రెస్ పీసీసీ చీఫ్ వైఎస్ . షర్మిల కూడా.. ఇదే దారిలో పయనిస్తున్నారన్న వాదన బలంగా వినిపిస్తుండడం గమనార్హం. నిన్న మొన్నటి వరకు అన్న జగన్‌ను టార్గెట్ చేసుకుని నిప్పులు చెరిగిన షర్మిల.. అనూహ్యంగా తన బాణాలను సీఎం చంద్రబాబువైపు మళ్లించారు. చంద్రబాబు కూడా.. అమ్ముడు పోయారా? అంటూ.. వ్యాఖ్యలు చేశారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతం అదానీ వ్యవహారంలో తన సోదరుడు లంచాలు తీసుకున్నారన్న ఆరోపణలపై ఆమె కొన్నాళ్లుగా విజృంభిస్తున్న షర్మిల.. దీనిపై విచారణకు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఏసీబీకి కూడా ఫిర్యాదులు చేశారు. కానీ, ఎవరూ పట్టించుకోలేదు. పైగా సొంత పార్టీలోనూ ఎవరూ షర్మిలకు ఇప్పుడు కూడా అండగా నిలిచింది లేదు. నిజానికి ఇతర విషయాల మాట ఎలా ఉన్నా.. అదాని వ్యవహారాన్ని జాతీయ కాంగ్రెస్ కూడా తీవ్రంగా చూస్తోంది. పార్లమెంటు ఉభయ సభలను కూడా స్తంభింప చేస్తున్నారు. ఇలాంటి సమయంలో ఏపీలో ఇదే విషయంపై పోరాడుతున్న షర్మిలకు రాష్ట్ర నాయకులు అండగా ఉంటారని అనుకున్నారు. కానీ, ఒక్కరంటే ఒక్కరు కూడా షర్మిల వ్యాఖ్యలను బలపరిచేలా వ్యవహరించకపోవడం గమనార్హం. ఈ క్రమంలోనే ఏసీబీ ఫిర్యాదును తీసుకున్నా.. ఆమెకు ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. అన్నను జైలుకు పంపించాలన్న వ్యూహం తొలి అడుగులోనే బెడిసి కొట్టడంతో ఆమె వ్యూహం తప్పిపోయారు. నేరుగా చంద్రబాబును టార్గెట్ చేశారు. ఇదిమరో ప్రధాన తప్పిదమేనని అంటున్నారు పరిశీలకులు. సీఎంను తిట్టి పోసినంత మాత్రాన ఒత్తిడి చేసినంత మాత్రాన.. షర్మిల బాణాలు సూటిగా తగిలే అవకాశం లేదని.. ఆమెకు రాజకీయంగా ఇంకా కొంత కాలం నిరీక్షణ తప్పదని చెబుతున్నారు. ప్రస్తుతానికి అయితే.. అటు పార్టీలోను, ఇటు ప్రజల్లోనూ షర్మిల బాణాలు గురి తప్పుతున్నాయనే అంటున్నారు.

# మూడుచింతలపల్లి మండల కేంద్రంలో చైన్ స్నాచింగ్...

**పెద్దావిడ భయపడకుండా తన పుస్తెలతాడు పట్టుకోవడంతో మూడు తులాల పదిలం...**

**నిందితుల సిసి ఫుటేజ్ ఫోటోలు విడుదల చేసిన శామీర్పేట పోలీసులు...**





శామీర్ పేట, డిసెంబర్ (గరుడ వార్త) : చైన్ స్నాచింగ్ సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మూడు చింతలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మంగళవారం మండల కేంద్రం మూడు చింతలపల్లిలో వరి ధాన్యం రోడ్డుపై ఆరబెడుతుండగా, ద్విచక్ర వాహనం పై వచ్చిన గుర్తుతెలియని దొంగలు పుస్తెలతాడును లాక్కెళ్ళారు. అయితే సదరు మహిళ పూసల్తాడు లాక్కెళ్ళే సమయంలో, తన పుస్తెలతాడును భయపడకుండా గట్టిగా పట్టుకోవడంతో నాలుగు తులాల బంగారి పుస్తెలతాడులో మూడు తులాలు కాపాడుకోగలిగింది. ఇక చేతికి అందిన ఒక తులం తెంపుకొని ద్విచక్ర వాహనంపై దొంగలు పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల అనుసారం... మూడుచింతలపల్లి గ్రామానికి చెందిన అత్తెల్లి బసవమ్మ రోజువారి లాగే తన వ్యవసాయ పొలం వద్ద వరి ధాన్యాన్ని ఆరపెడుతుండగా గుర్తు తెలియని ఇద్దరు దుండగులు యాక్టీవా వాహనం పై వచ్చి ఆమె మెడలో నుంచి సుమారు 4 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని పారి పోయారు. ఆమె ప్రతిఘటించగా పుస్తెలు తాడులో కొంత భాగం ఆమె వద్ద మిగలగ, కొంత భాగం దొంగలు ఎత్తుకెల్లారు. దీంతో ఆమె కేకలు వేయగా స్థానికులు వచ్చేసరికి దొంగలు పారిపోయారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారమివ్వగా సంఘటన స్థలానికి చేరుకున్న షామీర్పేట సీఐ శ్రీనాథ్, ఎస్సైలు వారితో పాటు పోలీస్ కానిస్టేబుల్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి, అనంతరం బాధితుల మరియు స్థానికుల నుండి పూర్తి వివరాలను సేకరించారు. దాంతో పాటుగా నిందితులు పారిపోతున్న సిసి ఫుటేషన్ వెలికి తీసి సమాజానికి తెలిసేందుకుగాను మీడియాకు తెలియజేశారు. ఈ మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# వైద్యానికి నిరీక్షించాల్సిందే!



జగిత్యాల : రోజురోజుకూ పెరుగుతున్న రోగులు, సరిపోని పడకలు, సేవలకు అనుగుణంగా లేని వార్డులు, పెద్దాసుపత్రిలో రోగుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. జిల్లాను జ్వరాలు వణికిస్తుండటంతో మూడు నెలలుగా జిల్లా కేంద్ర ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతోంది. నిత్యం ఓపీ 400పైనే నమోదవుతోంది. అన్ని మండలాల నుంచి నిత్యం వందల సంఖ్యలో రోగులు పెద్దాసుపత్రికి వస్తున్నారు. ఓపీ కేంద్రం వద్ద, వైద్యులు రోగులను పరీక్షించే గదుల ముందు, రక్తపరీక్ష కేంద్రాల వద్ద, మందులు తీసుకునే చోట అంతటా రోగులు బారులు తీరుతున్నారు. వైద్యులు రాసిన మందులన్నీ ఆసుపత్రిలో లేకపోవడంతో రోగులు బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. జిల్లా కేంద్ర ఆసుపత్రిపై కథనం..

నాడీ పట్టేదేలేదు..

ఆసుపత్రిలో చాలామంది వైద్యులు రోగుల నాడీ చూడట్లేదు. స్టెతస్కోప్ సైతం ముట్టడంలేదు. రోగులు చెప్పే లక్షణాల ఆధారంగా మందులు రాసి ఇస్తున్నారు. రక్తపరీక్షలు కూడా రోగులు కోరినప్పుడే రాస్తున్నారు. లేదంటే మందులు రాసి పంపిస్తున్నారు. రోగులు ఎక్కువగా రావడం, వైరల్ జ్వరాలే ఉండటంతో వైద్యులు కూడా లక్షణాలకు అనుగుణంగా మందులతో సరిపెడుతున్నారు.

మౌలిక వసతులు కరవు

150 పడకల స్థాయితో వైద్య కళాశాల అనుబంధంగా సాధారణ ఆసుపత్రిగా మారినప్పటికీ రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇందులో కొన్ని విభాగాలను ఎంసీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అత్యవసర వైద్యం, జనరల్ మెడిసిన్, సర్జరీలు, ఆర్థోపెడిక్ సేవలు మాత్రమే ఇక్కడ ఉన్నాయి. జ్వరాలతో పడకలు సరిపోక వార్డుల్లోనూ రోగులను ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. రోగులకు తాగునీటి వసతి కూడా లేకపోయింది. అన్ని వార్డుల్లోనూ రోగులు సేదతీరేందుకు బల్లలు, కుర్చీలు అమర్చితే సౌకర్యంగా ఉంటుంది.

తప్పని నిరీక్షణ..

ఓపీ కేంద్రంలో ఉదయం 10.30 నుంచి 12 గంటల మధ్య ఒకేసారి వందల సంఖ్యలో రోగులు రావడంతో నమోదు కోసం నిరీక్షించాల్సి వస్తోంది. బల్లలు సరిపోక కొందరు వరండాలో నిరీక్షిస్తున్నారు. ఆధార్‌కార్డు అనుసంధానం చేసి వివరాలన్నీ కంప్యూటర్‌లో నమోదు చేసి చీటీ ఇవ్వడానికి కనీసం రెండు మూడు నిమిషాలైనా పడుతోంది. రోగులు సహాయకుల సాయంతో ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి వస్తోంది. సహాయకులు లేకుండా వచ్చేవారు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రోగుల నిరీక్షణ కోసం మరిన్ని బెంచీలు ఏర్పాటు చేస్తే రోగులకు సౌకర్యంగా ఉంటుంది. కన్సల్టేషన్ వద్ద కూడా ఒక్కోసారి పదుల సంఖ్యలో రోగులు గుమికూడి ఉంటున్నారు. వారంతా వరండాలోనే నిరీక్షించాల్సి వస్తోంది.

ఔషధాల కొరత...సాధారణ ఆసుపత్రిలో గంటల తరబడి నిరీక్షించిన రోగులకు మందుల దగ్గరకు వచ్చేసరికి పూర్తిస్థాయిలో లేకపోవడంతో కొన్ని బయటే కొనాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని యాంటీబయోటిక్స్, ఇతర మందులు అందుబాటులో ఉండటంలేదు. విధిలేని పరిస్థితిలో రోగులు బయట కొంటున్నారు. కరీంనగర్ పంపిణీ కేంద్రం నుంచి సకాలంలో మందులు జగిత్యాలకు రాకపోవడమే కారణమని వైద్య వర్గాలు చెబుతున్నాయి.

# చారిత్రక ప్రదేశాలపై నిర్లక్ష్యం




మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లోని చారిత్రక ప్రదేశాలు కనుమరుగవుతున్నాయి. కొండపైన ఆలయానికి వెనుకవైపున కొండాల్‌రాయుడి స్థావరానికి వెళ్లే దారిని మూసివేయడంపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 400 ఏళ్ల కిందట అంజన్న ఆలయం నిర్మించినట్లు చారిత్రక ఆధారాలుండగా పరిసరాల్లో పలు దర్శనీయ స్థలాలు ఉన్నాయి. ఆలయానికి ఈశాన్య భాగంలోని కొత్త పుష్కరిణికి సమీపంలో మునుల గుహ ఉంది. పూర్వం వాటిలో మునులు తపస్సు చేసుకునేవారని అర్చకులు చెబుతారు. ఆలయానికి వెనుక భాగంలో పెద్ద బండరాళ్లపై కొండాల్‌రాయుడు అనే పరాక్రమవంతుడు శత్రువులబారి నుంచి తనను తాను రక్షించుకోవడానికి నివాసముండేవారని, చివరికి శత్రువులకు చిక్కకుండా తన గుర్రంతో సహా బండరాళ్లపై నుంచి అగాధంలో దూకి ప్రాణత్యాగం చేశారని చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఆలయానికి వెళ్లే దారి పక్కన సీతమ్మ కన్నీటి ధారలు, ప్రకృతి సిద్ధంగా ఏర్పడ్డ పాత కోనేరు, స్వామివారికి నిత్యం అభిషేకం చేయడానికి గుట్టల దిగువ ప్రాంతం నుంచి నీటిని తీసుకొచ్చే మంచినీళ్ల బావి ఇక్కడి ప్రత్యేకతలు. ఇటీవల కొండాల్‌రాయుడి నివాస ప్రాంతానికి వెళ్లే దారికి అడ్డంగా గోడ నిర్మించి భక్తులు వెళ్లకుండా శాశ్వతంగా మూసివేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. మునుల గుహకు వెళ్లే దారి కూడా అపరిశుభ్రంగా ఉందని భక్తులు పేర్కొంటున్నారు.

కొండపైన ప్రసాదం తయారీ కేంద్రానికి సమీపంలో పులిపడ్డ బావిగా పేరుపొందిన రాతి బావి ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. ఘాట్‌రోడ్డు పక్కన ప్రకృతి సిద్ధంగా ఏర్పడ్డ జలబుగ్గ కాలువలో మండువేసవిలోనూ నీరుంటుంది. ఇటీవల కొందరు స్థిరాస్థి వ్యాపారులు ఈ కాలువను కూడా మూసివేయడంపై స్థానికులు పలుమార్లు ఆందోళన నిర్వహించినా పట్టించుకునే వారు కరవయ్యారు. ఈ విషయమై ఈవో రామకృష్ణారావును వివరణ కోరగా చారిత్రక ఆధారాలున్న కొండాల్‌రాయుడి స్థావరంగా పేర్కొనే ప్రదేశానికి వెళ్లకుండా గోడ నిర్మించిన విషయం తెలియదన్నారు. మునుల గుహ, ఇతర చారిత్రక ప్రాంతాల రక్షణకు చర్యలు తీసుకుంటామని, అవసరమైన చోట రక్షణ కోసం గ్రిల్స్ ఏర్పాటు చేయిస్తామన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తిశ్రద్ధలతో అన్న ప్రసాద వితరణ

శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ రేణుక ఎల్లమ్మ





ఆలయం వద్ద ఆలయం తరఫున గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా శామీర్ పేటకు చెందిన కీ . శే తూముకుంట సాంబయ్య గౌడ్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు 25 కేజీల బియ్యం అందజేశారు. వివిధ గ్రామాల భక్తులు మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# పట్టా కాదు.. పట్టు బిగించాలి

పెద్దపల్లి : చేతిలో పట్టా ఉన్నా ఉద్యోగం దొరకదు.. చదివిన చదువుకు, చేసే పనికి సంబంధం ఉండదు.. ఫలితంగా మొక్కుబడిగా విధులు నిర్వర్తించడం తప్ప యువత కెరీర్‌లో రాణించలేకపోతున్నారు.. సర్టిఫికెట్ల కోసం తప్ప అవసరాలు తీర్చలేని కోర్సుల్లో బోధన విధానం మార్చడమే ప్రత్యామ్నాయమని నిపుణులు సూచిస్తున్నారు..

యువతకు ఉద్యోగాన్వేషణలో అవసరమైన నైపుణ్యంపై శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం జిల్లాల వారీగా టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జి) కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, సిరిసిల్ల పట్టణాల్లో గతంలోనే కేంద్రాలు ఏర్పాటయ్యాయి. పెద్దపల్లిలో ఇటీవల ప్రారంభించినా తరగతులు నిర్వహించడం లేదు. నాలుగు జిల్లాల్లో కలిపి 50 వరకు ప్రైవేటు శిక్షణ కేంద్రాలున్నా చాలా మంది అభ్యర్థులు ఆర్థిక స్థోమత లేక చేరడం లేదు. గ్రంథాలయాలను వినియోగించుకుంటున్నా బోధన సౌకర్యం లేక ఉద్యోగ పరీక్షల్లో వెనుకబడుతున్నారు.

ఉద్యోగాల వారధిగా..కొలువుల సాధనలో యువతకు ఒకప్పుడు ఉపాధి కల్పన శాఖ అండగా ఉండేది. తమ వద్ద వివరాలు నమోదు చేసుకుంటే విద్యార్హతల ఆధారంగా కాల్ లెటర్స్ పంపించేది. ప్రపంచీకరణ నేపథ్యంలో ఆ శాఖ ప్రాధాన్యం తగ్గింది. కొంతకాలంగా ఆ శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నారు. వివిధ కంపెనీల్లో కొలువులు దక్కించుకునేలా నిరుద్యోగులను ప్రోత్సహిస్తున్నారు.

ఎందుకిలా!కళాశాలల్లో నైపుణ్యాలు నేర్పించడం లేదు.భవిష్యత్తును నిర్దేశించే అంశాలు బోధించడం లేదు.విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, అంతర్గత నైపుణ్యం పెంపుపై అవగాహన కరవైంది. చదువుకు, వివిధ సంస్థల అవసరాలకు పొంతన ఉండటం లేదు.

ఏమిటీ మార్గం?ఇండియా స్కిల్ రిపోర్టు ప్రకారం ఇంజినీరింగ్ విద్యార్థుల్లో 65 శాతం మందిలోనే నైపుణ్యం ఉన్నట్లు తేలింది. డిగ్రీ, ఇంజినీరింగ్ కోర్సుల్లో కొలువుకు అవసరమైన సిలబస్ ఉండటం



లేదని పరిశ్రమల ప్రతినిధులు చెబుతూనే, సమూల మార్పులు చేయాలని ప్రతిపాదిస్తున్నారు.ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర ప్రముఖ విద్యాసంస్థల్లో అమలవుతున్న కోర్సులను ప్రవేశపెట్టనున్నారు.

అవసరం లేని పాఠ్యాంశాలను తొలగించి భవిష్యత్తు డిమాండ్ ఆధారంగా సిలబస్ రూపొందించనున్నారు.

ఆత్మవిశ్వాసంతో ఎంపికయ్యా డిగ్రీ పూర్తి చేసిన అనంతరం పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతూ ఉపాధికల్పన శాఖ ఉద్యోగ మేళాకు హాజరయ్యా. కంపెనీ ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆత్మవిశ్వాసంతో సమాధానాలిచ్చా. ప్రస్తుతం మంచి వేతనంతో ఉద్యోగం చేస్తున్నా.

మల్లీశ్వరి, ప్రైవేటు ఉద్యోగి, జగిత్యాల

సన్నద్ధతపై అవగాహన కల్పిస్తున్నాం

డిగ్రీ, పీజీ, వివిధ వృత్తివిద్యా కళాశాలల్లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, బ్యాంకింగ్, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు సన్నద్ధతపై అవగాహన కల్పిస్తున్నాం. జాతీయ స్థాయిలో పోటీ పడేలా నేషనల్ కెరీర్ సర్వీస్(ఎన్‌సీఎస్) పోర్టల్‌లో ఎలా నమోదు చేసుకోవాలో వివరిస్తున్నాం. నెలలో రెండు సార్లు ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నాం.

తిరుపతిరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి, కరీంనగర్

**విషయ నైపుణ్యమే ప్రధానం**

ఉన్నత విద్యావంతులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. నైపుణ్యంతో కూడిన బోధన అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. చదువుకునే సమయంలోనే విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి. కళాశాలల్లో కెరీర్ గైడెన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. భాషా నైపుణ్యంపై పట్టు సాధించాలి.సతీశ్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలఉపాధికల్పన కార్యాలయాల్లో నమోదైన అభ్యర్థులు మొత్తం 53,837 కరీంనగర్ 18,229 జగిత్యాల 10,008 పెద్దపల్లి 20,128 రాజన్న సిరిసిల్ల 7,472

# సీఎస్ఆర్ నిధులు... ఆధునిక సౌకర్యాలు

జిన్నారం : సీఎస్ఆర్ నిధులు గ్రామాలకు వరప్రసాదంగా మారుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు మారేందుకు దోహదపడుతున్నాయి. జిన్నారం మండలం ఖాజీపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కోసం నిర్మిస్తున్న భవనం పూర్తయ్యే దశకు చేరింది. ఈ నెలాఖరులో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. స్థానిక పారిశ్రామికవాడలోని కెమ్‌టెక్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో దీని నిర్మాణం చేపట్టారు.

**సమస్యలు పునరావృతం కాకుండా..**

గతంలో శిథిల భవనం కావడంతో వాన కురిస్తే విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ఆ రోజు సెలవు ఇవ్వాల్సిన దుస్థితి. మరోవైపు ఇరుకు గదులతో పాట్లు పడక తప్పలేదు. ఈ ఇబ్బందులు తీర్చేందుకు కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. ఐదు తరగతి గదులు, గ్రంథాలయం, కార్యాలయానికి వేర్వేరుగా గదులు నిర్మించారు. గతంలో ఒక గదిలో రెండు తరగతుల వారిని కూర్చోబెట్టగా.. ఇప్పుడిక ఆ సమస్య ఉ



ండదు. విశాలమైన భోజనశాల సైతం అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రస్తుతం రంగులు వేస్తున్నారు. రూ.1.8 కోట్ల అంచనాతో నిర్మాణ పనులు చేపట్టారు.

**అంగన్‌వాడీ సైతం**

ఇదే సముదాయంలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఎలాంటి అవస్థలు పడకుండా అన్ని వసతులు కల్పిసున్నారు. ప్రత్యేకంగా సామగ్రి నిల్వ కోసం ప్రత్యేకంగా గదిని నిర్మించారు. చిన్నారులకు సకల సౌకర్యాలు కల్పించారు. వారిని ఆకట్టుకునేలా కార్పోరేట్ తరహాలో గోడలపై బొమ్మలు వేయించారు.

అన్ని సదుపాయాలతో..: అన్ని వసతులతో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గతంలో ఉన్న సమస్యలు చాలా వరకు పరిష్కారం అయినట్లే. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఒనగూరనున్నాయి. అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు

# సీడీపీ నిధులేవి?

ఆదిలాబాద్ : సాధారణంగా ఎమ్మెల్యేకు ఏటా నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం(సీడీపీ) కింద నిధులు విడుదలవుతాయి. గ్రామాల్లో ఇచ్చిన హామీలు.. కార్యకర్తలు సూచించిన పనులను మంజూరు చేసేందుకు ఎమ్మెల్యేలకు ఉన్న ఏకైక నిధి ఇదే. గెలుపొంది ఏడాది కావొస్తున్నా ఈ సీడీపీ నిధుల జాడ లేకపోవడంపై ఎమ్మెల్యేలు నిట్టూరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని విపక్ష ఎమ్మెల్యేల పరిస్థితి అయోమయంగా ఉందని వారి అనుచరులు వాదిస్తున్నారు. తమ వద్దకు వచ్చిన ప్రజల సమస్యలు పరిష్కరించలేకపోతున్నామని ఇటు ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు గత ప్రభుత్వ హయాంలో తొలుత సీడీపీ కింద రూ.3 కోట్లకు పెంచారు. చివరి సంవత్సరం 2022-23లో ఆ నిధి ఏకంగా రూ.5 కోట్లకు పెరిగింది. నిధులు పెంచినా అందులో ఒక నిబంధనను తీసుకొచ్చారు. రూ.3 కోట్లు ఎమ్మెల్యే కోటా కింద విడుదల చేసి మిగతా వారి ప్రమేయం లేకుండానే రూ.2 కోట్లు నేరుగా ప్రభుత్వమే విద్యాశాఖ కింద 'మన ఊరు - మన బడి'కి కేటాయించింది. దీంతో కోటా పెంచినా అంతగా ప్రయోజనం లేకుండా పోయిందని అప్పట్లో కొందరు ఎమ్మెల్యేలు ఆవేదన వెలిబుచ్చారు. ఆఖరుగా 23.05.2023న జిల్లాలకు సీడీపీ కింద రూ.3 కోట్ల చొప్పున ఒక్కో నియోజకవర్గానికి విడుదలయ్యాయి. ఇది ఇంతకు ముందున్న ఎమ్మెల్యేలు వినియోగించారు. కొత్తవారికి ఇప్పటి వరకు ఏమీ రాలేదు.

**పదిలో ఆరుగురు విపక్ష ఎమ్మెల్యేలే**

గత డిసెంబరు 7న ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. తాజాగా సంవత్సరం కావొస్తోంది. సీడీపీ నిధుల జాడలేక విపక్ష ఎమ్మెల్యేలు నిరాశలో ఉన్నారు. అధికార కాంగ్రెస్‌కు సంబంధించి మంచిర్యాల, ఖానాపూర్, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ప్రేంసాగర్‌రావు, వెడ్మబొజ్జు, వివేక్, వినోద్‌లు గెలుపొందారు. బోథ్, ఆసిఫాబాద్‌లలో భారాసకు చెందిన అనిల్‌జాదవ్, కోవలక్ష్మి విజయం సాధించారు. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్ నియోజకవర్గాల్లో భాజపా నుంచి పాయల్‌శంకర్, మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, పాల్వాయి హరీష్‌బాబులు గెలుపొందారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రం ఇతర నిధులతో పనులు మంజూరు చేయించుకుంటున్నా ఆరురుగు విపక్ష ఎమ్మెల్యేలు ఉండటంతో నిధుల కేటాయింపు సమస్యగా మారింది.

**నిరాశే..**

అసలే సీడీపీ నిధుల విడుదల లేక అయోమయంగా ఉన్న విపక్ష ఎమ్మెల్యేలకు ఇతర నిధుల్లోనూ ప్రాధాన్యం లభించకపోవడం ఇబ్బందికరంగా మారింది. నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున ప్రత్యేక అభివృద్ధి నిధి(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) మంజూరుకాగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నచోట వారే పనులు ప్రతిపాదించారు. విపక్ష ఎమ్మెల్యేలు ఉన్నచోట మాత్రం వారు ప్రతిపాదించిన పనులను పక్కనపెట్టడం రాజకీయ చర్చకు తెరలేపింది. ఈ పనులను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదించాల్సి ఉండటంతో అన్ని చోట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జులు సూచించిన పనులకు అధిక ప్రాధాన్యమిచ్చినట్లు తెలుస్తోంది. గెలిచిన కొత్తలో ఉపాధిహామీ కింద రోడ్లు, మురుగుకాలువల కోసం నిధులు రాగా కాంగ్రెస్ కార్యకర్తలకు కొన్ని కేటాయించి మిగతా సగం విపక్ష ఎమ్మెల్యేలకు సైతం రూ.3.50 కోట్ల చొప్పున మంత్రి కేటాయించడంతో అంతా సంతృప్తిచెందారు.

అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని మంత్రి చెప్పడంతో ఇతర నిధుల కేటాయింపుల్లోనూ ప్రాధాన్యం ఉంటుందని విపక్ష ఎమ్మెల్యేలు భావించినా ఎస్‌డీఎఫ్ పనుల్లో నిరాశే మిగలడంతో కథ మొదటికొచ్చింది. దీంతోనే సీడీపీ నిధుల విడుదలకు పట్టుబడుతు న్నారు. కేవలం కల్యాణలక్ష్మి చెక్కులు, సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీకే పరిమితమవుతున్నామని విపక్ష ఎమ్మెల్యేలు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక అన్ని నిధుల్లో ఎమ్మెల్యేల ప్రతిపాదనలే తీసుకోవాల్సి ఉన్నా తమ హక్కులను కాలరాస్తున్నారని విపక్ష ఎమ్మెల్యేల్లో ఒకరైన భారాసకు చెందిన బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పేర్కొనడం ఇక్కడ ప్రస్తావించాల్సిన అంశం.

# నవోదయం.. విద్యార్థులకు ఉషోదయం




సంగారెడ్డి : నాణ్యమైన విద్య, సామాజిక అంశాలపై అవగాహన, మానవీయ విలువలు, ప్రమాణాలు పెంచడంతో పాటు తదితర అంశాల్లో తీర్చిదిద్దడం నవోదయ విద్యాలయాల ప్రత్యేకత. గ్రామీణ, పేద, మధ్యతరగతి విద్యార్థులకు అత్యున్నత విద్య అందించాలన్న సదుద్దేశంతో కేంద్ర విద్యాశాఖ వీటిని నిర్వహిస్తోంది. ఇక్కడ చదువుకున్న వారెంతో మంది ఉన్నత స్థానాలకు చేరారు. ఇలాంటి ప్రతిష్ఠాత్మక విద్యాలయం ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన గతంలో కేటాయించగా, ప్రస్తుత సిద్దిపేట జిల్లా వర్గల్‌లో కొనసాగుతోంది. తాజాగా సంగారెడ్డి జిల్లాకు కేటాయిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

నవోదయ పాఠశాలలో 6 నుంచి ఇంటర్ వరకు బోధిస్తారు. ప్రతి ఏటా 6వ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఒక్కో సెక్షన్‌లో 40 మంది చదువుకుంటున్నారు. ప్రస్తుతం సంగారెడ్డికి మంజూరైన విద్యాలయం 2025-26 విద్యాసంవత్సరం నుంచి ప్రారంభం అయ్యే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

**క్రీడల్లో ప్రత్యేకంగా..**

ఈ విద్యాలయంలో చదువుతో పాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. నిత్యం రెండు గంటల పాటు ఆటలపై సాధన చేయిస్తారు. ప్రతి ఏటా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రత్యేకంగా పోటీలు నిర్వహించి అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నారు. దేశంలో ఏ నవోదయ విద్యాలయంలో పోటీలు జరిగినా తీసుకెళ్లి భాగస్వాములను చేస్తుంటారు. మరోవైపు సాంస్కృతిక అంశాల్లోనూ శిక్షణ ఇవ్వడం మరో ప్రత్యేకత. ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపి పిల్లలకు ఇష్టమైన అంశాల్లో తర్ఫీదు ఇస్తుంటారు. బోధకులకు బడి ఆవరణలో నివాస సముదాయం ఉండటం వల్ల రాత్రి వేళల్లో కూడా ప్రత్యేక శ్రద్ధ చూపవచ్చు.

**ఉత్తర భారతానికి..**

8వ తరగతి పూర్తయ్యాక 9వ తరగతి ఉత్తర భారతదేశంలోని ఏదో ఓ రాష్ట్రానికి పంపించి అక్కడ చదివిస్తారు. దీనివల్ల అక్కడి సంస్కృతి, సంప్రదాయం కూడా తెలుస్తుందన్నదే దీని వెనుక ఉన్న ఉద్దేశం. తిరిగి పదో తరగతిలో యథాస్థానానికి తీసుకొచ్చి చదివిస్తారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు సైతం అందుబాటులో ఉంటాయి.

**నెరవేరిన కల**

సంగారెడ్డి జిల్లాలో నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలని దశాబ్దాలుగా డిమాండ్ ఉంది. ఉమ్మడి జిల్లాలో వర్గల్ ఒక్క చోటే ఉండటంతో ఈ ప్రాంతంలోనూ నెలకొల్పాలని విన్నవించారు. గతంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభుత్వ అధికారులకు, మంత్రులకు విన్నవించారు. ఎట్టకేలకు కేంద్రం నవోదయ మంజూరు చేయడంతో ఈ ప్రాంతవాసుల కల నెరవేరింది. ఇందులో గ్రామీణ ప్రాంతం వారికి 25 శాతం సీట్లు కేటాయిస్తారు. ప్రస్తుతం అనువైన స్థలం కోసం విద్యాశాఖ అధికారులు అన్వేషిస్తున్నారు. ఇప్పటికే స్థల సేకరణ షురూ చేశారు.

**ఎన్నో ప్రత్యేకతలతో..**

ఉమ్మడి మెదక్ ప్రాతిపదికన వర్గల్‌లో 1987లో దీన్ని నెలకొల్పారు. అకాడమీ బ్లాక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, బాలబాలికలకు వేర్వేరుగా డార్మిటరీలు, భోజనశాల, బోధన బోధనేతర సిబ్బందికి క్వార్టర్లు, క్రీడా మైదానం, మెడికల్ అసిస్టెంట్ విభాగం ఇలా ఎన్నో వసతులు ఇక్కడ కల్పించారు. పచ్చందాల మధ్య పాఠశాల కొనసాగుతోంది. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి అన్ని రకాల కృషి చేస్తున్నారు. అత్యుత్తమైన 400 మీ. ట్రాక్ ఉన్న స్టేడియం, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులతోపాటు జిమ్ సైతం ఉంది. ఏటా 80 మంది బాలబాలికలకు ఆరో తరగతిలో ప్రవేశం కల్పిస్తున్నారు. విద్యార్థుల్లో జాతీయ సమైక్యత భావం పెంచేందుకు మైగ్రేషన్ విధానం అమలుచేస్తున్నారు. ప్రస్తుతం 21 మంది హరియాణాలోని హిసర్ నవోదయలో 9వ తరగతి చదువుతున్నారు. ఇక్కడ 460 మంది విద్యార్థులున్నారు.

**నాణ్యమైన బోధన: వెంకటేశ్వర్లు, సంగారెడ్డి డీఈవో**

జిల్లాకు నవోదయ పాఠశాల మంజూరు చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. సంబంధిత నివేదిక అందాక పూర్తి వివరాలు తెలుస్తాయి. స్థల సేకరణ నిమిత్తం కలెక్టర్‌కు లేఖ రాస్తాం. నవోదయలో సీబీఎస్ఈ విధానంలో బోధన జరుగుతుంది. నాణ్యమైన బోధన అందుతుంది. జిల్లావిద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలున్నాయి.

# మేమింతే.. ఎవరి మాట వినం



ఆదిలాబాద్ : జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పూర్తిగా ధ్వంసమైన లారీ ముందు భాగం, ఇందులో డ్రైవర్ మృత్యువాత పడ్డాడురహదారి ప్రమాదాలపై 'నేనూ బాధితుడినే' అంటూ లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, సుబ్రహ్మణ్య జైశంకర్‌లు వ్యాఖ్యానించటాన్ని పరిశీలిస్తే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వాహన ప్రమాదాలకు అధ్వాన రహదారులు ఒక కారణమైతే.. అడుగడుగునా నిబంధనలను ఉల్లంఘించడం రెండో కారణంగా నిలుస్తోంది. దేశవ్యాప్తంగా రహదారి నిబంధనల ఉల్లంఘన సర్వసాధారణమవుతోంది. ప్రమాద బాధిత కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి.

**ప్రాణం కాపాడిన శిరస్త్రాణం**

విద్యుత్తు శాఖలో ఉద్యోగి నజీర్ బేళ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ప్రమాదానికి గురయ్యాడు. కింద పడిపోయిన ఆయన తల వేగంగా వెళ్లి పక్కనున్న రాయికి తగిలింది. శిరస్త్రాణం ఉండటంతో చిన్న గాయాలతో బయటపడ్డారు.

**చిన్న ప్రమాదం.. రూ.7 లక్షల ఖర్చు**

ఇంద్రవెల్లి మండలం గౌరాపూర్‌కు చెందిన సంగెపు బొర్రన్న రెండేళ్ల కిందట ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రెండు భారీ వాహనాలు ఒకదాన్ని మరొకటి ఓవర్‌టేక్ చేసేక్రమంలో ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గాయాలయ్యాయి. భుజం వద్ద నరం దెబ్బతింది. చికిత్సకు ఇప్పటి వరకు రూ.7 లక్షలు ఖర్చు చేశారు. ప్రస్తుతం ఇంకా ఫిజియోథెరపీ చేయించుకుంటున్నారు.

**పిల్లలు అనుసరిస్తారు**

వాహనాలు నడిపేటప్పుడు రెడ్ సిగ్నల్ దాటడం, యూటర్న్ దూరంగా ఉందని అపసవ్య దిశలో వెళ్లడం, ఫోన్‌లో మాట్లాడుతూ తల్లిదండ్రులు నడిపితే.. పిల్లలూ అదే విధంగా ప్రవరిస్తారు. ప్రమాదాల బారిన పడతారు.

**అవగాహన కరవు..**

చాలా మందికి డ్రైవింగ్ లైసెన్సు ఉంటుంది. కానీ రోడ్డు భద్రతపై కనీస అవగాహన ఉండదు. పిల్లలకు పాఠశాలల్లో రహదారి నిబంధనలపై అవగాహన కల్పించటానికి వారానికో పీరియడ్‌ను కేటాయించాలి. స్వచ్ఛంద సంస్థలు, ట్రాఫిక్ పోలీసులు తరచూ అవగాహన కల్పిస్తే మార్పు వస్తుంది.

ఈ అమ్మ ఆదర్శంఆదిలాబాద్ పట్టణంలోని ఒక తల్లి పాఠశాలకు కుమారుడిని తీసుకెళ్లి, తీసుకొచ్చేటప్పుడు తాను శిరస్త్రాణం ధరిస్తూ కుమారుడికి సైతం పెట్టి ఆదర్శంగా నిలుస్తోంది. అంతా ఇలా పాటిస్తే ప్రమాదాల్లో ప్రాణాపాయం తప్పించుకోవచ్చు.

**చితికిపోతున్న కుటుంబాలు**

శిరస్త్రాణం ఉండదు.. అపసవ్య దిశలో ప్రయాణించటం, మద్యం తాగి నడపడం, అతి వేగం, చరవాణిలో మాట్లాడటం, ముందున్న వాహనాన్ని నిబంధనలు విస్మరించి ఓవర్‌టేక్ చేయటానికి యత్నించటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. విలువైన ప్రాణాలు గాలిలో కలిసి వారిపై ఆధార పడ్డ కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి. ప్రమాదంలో గాయాలతో బయటపడినా చికిత్సలకు రూ.లక్షల్లో వెచ్చించి ఆర్థికంగా నష్టపోతున్నారు. వాహనాలు నడిపే ప్రతి వంద మందిలో 40 మంది ఏదో ఒక సందర్భంలో చిన్నదో, పెద్దదో ప్రమాదం బారిన పడిన వారే ఉంటున్నారు.

నేనూ బాధితుడినే.. చట్టాలంటే ప్రజలకు భయం లేదు

'దేశంలో రోడ్డు ప్రమాదాల కారణంగా నిత్యం ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారు. ఈ ఘటనలు తగ్గించటానికి ప్రభుత్వం నిరంతరంగా కృషి చేస్తూనే ఉంది. ప్రజల నిర్లక్ష్యం వల్ల బాధితులు పెరిగిపోతూనే ఉన్నారు. నేనూ బాధితుడినే. చట్టాలంటే ప్రజలకు భయం, భక్తి లేకుండాపోయింది. రెడ్‌సిగ్నల్ పడితే ఆగరు. శిరస్త్రాణం ధరించరు. నా కళ్ల ముందే ఒక కారు నిబంధనలను విస్మరించి రెడ్ సిగ్నల్ దాటుకొని వెళ్లిపోయింది.' లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చేసిన వ్యాఖ్యలు.

# వాహనాలు మూలకు.. కదలని చెత్త

మంచిర్యాల : మంచిర్యాల పురపాలక సంఘంలో చెత్త తరలించే వాహనాల నిర్వహణ అధికారులు నిర్లక్ష్యంతో గాడితప్పింది. మరమ్మతులకు గురైన ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలు గ్యారేజీకే పరిమితం అవుతున్నాయి. ఇప్పటికే మూడు ఆటో ట్రాలీలు, ఒక ట్రాక్టర్, ఒక బ్లేడ్ ట్రాక్టర్, స్వీపింగ్ వాహనం పనిచేయడం లేదు.

ఫలితంగా వీధుల్లో ఎక్కడి చెత్త కుప్పలు అక్కడే పడిఉన్నాయి. మరికొన్ని ట్రాక్టర్లకు వెనుక భాగంలో పరికరాలు ఊడిపోయాయి. చెత్త తరలించేటప్పుడు రహదారిపై వెళ్లే వాహనదారులపై పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మున్సిపల్ కార్యాలయంలో పరిశుభ్రత పనులు చేయడానికి 34మంది శాశ్వత, 260 మంది ఒప్పంద కార్మికులు పనిచేస్తున్నారు. పట్టణంలోని 36 వార్డుల్లో రోజుకు 44 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. ఇందులో రోజుకు 42 మెట్రిక్ టన్నులు తొలగిస్తున్నారు. చెత్త తరలించడానికి ఒక్కో వార్డుకు ఒక్కో ఆటోట్రాలీ కేటాయించారు. షాపింగ్ ఏరియా, పెద్ద కాలనీలు ఉన్న వార్డుల్లో రెండు వాహనాలు కేటాయించారు. రెండు మూడు వార్డులకు కలిపి ఒక ట్రాక్టర్ కేటాయించారు. ఇప్పుడు అయిదు వాహనాలు మరమ్మతులకు గురికావడంతో ఆ వార్డుల్లో చెత్త కుప్పలు పెరిగిపోతున్నాయి. అన్ని వాహనాలు నడిచినప్పుడే పట్టణంలో పూర్తి స్థాయిలో చెత్త శుభ్రం చేయడంలో విఫలమయ్యారు. పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించడానికి ఇక్కడ ఒక సూపర్‌వైజర్, ఇద్దరు పారిశుద్ధ్య విభాగం ఇన్‌ఛార్జి అధికారులు ఉన్నారు. వీరి మధ్య సమన్వయ లోపంతో పరిశుభ్రత పనులపై పట్టించుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలోని ప్రధాన వీధుల్లో నిత్యం వాహనాల రాకపోకలు సాగించడంతో ఆ రహదారులకు ఇరుపక్కల దుమ్ము పేరుకుపోయింది. దీన్ని శుభ్రం చేయడానికి ఉపయోగించే బ్లేడ్ ట్రాక్టర్, స్వీపింగ్ వాహనం పనిచేయడం లేదు. రహదారులపై ఉన్న ఇసుక దుమ్ముతో వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు.

# అటు మబ్బులు.. ఇటు కుప్పలు..

మంచిర్యాల : పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి అన్నదాతలకు అగచాట్లు తప్పడం లేదు. తేమ పేరుతో మిల్లర్లు ధాన్యం మిల్లుల్లో దించుకోవడానికి కొర్రీలు పెట్టడంతో కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. దీనికి తోడు వాతావరణలో మబ్బులు రావడంతో పాటు అక్కడక్కడ పడుతున్న వర్షాలతో అవస్థలు తప్పడం లేదు. వారం రోజులుగా ఆకాశంలో వస్తున్న మబ్బులతో రైతులు గుండెల్లో గుబులు రేపుతోంది. రోజుల తరబడి ధాన్యం కుప్పల దగ్గరే పడిగాపులు కాయాల్సి వస్తోంది. వాతావరణం చల్లగా ఉండి మబ్బులు రావడంతో తేమ రావడం లేదని ధాన్యం కొనుగోళ్లు ఆలస్యంగా జరుగుతుండటం రైతులకు ఇబ్బందిగా మారింది. మరోవైపు సన్న వరి ధాన్యం కొనేందుకు ఈసారి వ్యాపారులు ముందుకు రాకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

**సన్నాలు కొనేవారేరి..?**

రెబ్బనపల్లి సమీపంలో సన్న రకం ధాన్యం కుప్పలు పోసి వీటిపై కవర్లు కప్పారు. ప్రభుత్వం దొడ్డు రకాలతోపాటు ఎంపిక చేసిన కొన్ని రకాల సన్నాలు మాత్రమే కొనుగోలు చేస్తోంది. ఇతర సన్నాలను వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి. వాతావరణంలో మార్పులతో కొనడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. గతేడాది ఇదే సమయంలో సన్నాలకు వ్యాపారులు క్వింటాలుకు రూ. 3 వేల వరకు చెల్లించారు. కానీ ఈసారి రూ. 2800, రూ. 2850 ధరతో కొనుగోలు చేస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు. దీంతో సన్నాలు సాగు చేసిన రైతులు కుప్పలు పోసి 15 నుంచి 20 రోజులు గడుస్తున్నా వీటిని



కొనేవారు లేక పడిగాపులు కాస్తున్నారు. దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్‌లో ఒకేచోట 20 మంది రైతులు ధాన్యం అమ్మేందుకు ఇక్కడే కుప్పలు పోశారు. వారం రోజులుగా వాతావరణంలో వస్తున్న మబ్బులు, చిరుజల్లులకు ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. వర్షం పడటంతో చాలా చోట్ల ధాన్యం తడిసిపోయింది. శనివారం ఉదయం నుంచి రైతులు ధాన్యాన్ని ఆరబోస్తూ ఎన్నో ఇబ్బందులు పడ్డారు. మళ్లీ మబ్బులు రావడంతో సాయంత్రం ధాన్యాన్ని రక్షించుకునేందుకు కుప్ప చేస్తూ పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం..

**కుప్ప పోసి 20 రోజులవుతోంది..**మేకల తిరుపతి, రైతు, రెబ్బనపల్లి

నేను పది ఎకరాల్లో సన్న రకం వరి సాగు చేశాను. 20 రోజుల కిందటే ధాన్యం చేతికొచ్చింది. కానీ ఇప్పటివరకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. క్వింటాలుకు రూ. 2800 మాత్రమే అంటున్నారు. ఇదే ధరకు అమ్మితే గిట్టుబాటు కాదు.. వ్యాపారులు ధర చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

**రోజూ కుప్ప చేయడం.. ఆరబోయడంతోనే సరిపోతోంది**

ఇండ్ల ఆత్మారావు, రెబ్బోనపల్లి

వారం రోజులుగా మబ్బులు రావడంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు పొద్దంతా ఆరబోయడం, సాయంత్రం కుప్ప పోసి కవర్లు కప్పాల్సి వస్తోంది. కవర్లకే రోజుకు రూ. వంద అద్దె అవుతోంది. తేమ రావడం లేదంటూ కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. వెంటనే కొనుగోళ్లు జరిగేలా చూడాలి.

# అర్హుల నిర్ధారణకు ఇంటింటి సర్వే

నిజామాబాద్ : ఇందిరమ్మ ఇళ్ల పథకానికి జిల్లాలో అర్హుల ఎంపికకు కసరత్తు మొదలైంది. పథకం అమలుకు సర్కారు ఇప్పటికే యాప్ తెచ్చింది. ప్రజాపాలన దరఖాస్తుల వివరాలు అందులో పొందుపర్చారు. 360 డిగ్రీ సాఫ్ట్‌వేర్‌లో తప్పుడు వివరాలు సరిచూడటం కూడా పూర్తయింది. జిల్లాలో 3.42 లక్షల దరఖాస్తులు రాగా.. ఇప్పుడు 2.34 లక్షలే అర్హమైనవిగా తేలాయి. అయినప్పటికీ అర్హులను తేల్చేందుకు ఇంటింటి సర్వే చేసేందుకు రెండు అంచెల్లో శిక్షణ ఇచ్చారు. క్షేత్రస్థాయి పరిశీలించి యాప్‌లో వివరాలను నిర్ధారించాల్సి ఉంటుంది.

**సర్వే బృందాలకు శిక్షణ:** సర్వే బాధ్యతలు ప్రభుత్వ సిబ్బందే చూడనున్నారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులైన జూనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లు, ఇతర విభాగాల సిబ్బంది ఉంటారు. వీరికి ఇప్పటికే నిబంధనలు, సూచనలు చేశారు. ఇందుకు భిన్నంగా ఎంపికలు చేస్తే సదరు ఉద్యోగులనే బాధ్యులను చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తారు.

**మూడు చిత్రాలు తీస్తారు..:** దరఖాస్తుదారు ప్రస్తుతం ఉంటున్న ఇంటి ఎదుట నిల్చోబెట్టి ఒకటి, ఇల్లు కనిపించేలా మరొకటి, ఖాళీ స్థలం చిత్రం నమోదు చేస్తారు. ఇప్పటికే ఇళ్లు కట్టుకున్న వారు చాలా మంది దరఖాస్తు చేశారు. వారి వివరాల నమోదులో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వీరికి పథకం వర్తించదని చెబుతున్నారు. ఖాళీ స్థలానికి జియోట్యాగింగ్ చేస్తారు. కొత్తగా కట్టనున్న ఇంటికే నాలుగు దశల్లో రూ.5 లక్షలు మంజూరు చేయనున్నారు. పూరిగుడిసెలు, శిథిలావస్థ ఇళ్లల్లో ఉంటున్న వారికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**పైలెట్ ప్రాజెక్టు సర్వే పూర్తి..:** పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన జక్రాన్‌పల్లి మండలం మాదాపూర్, ఆర్మూర్ బల్దియాలో 23వ వార్డులో సర్వే పూర్తయింది. మాదాపూర్‌కు సంబంధించి యాప్‌లో 129 మంది వివరాలున్నాయి. 360 డిగ్రీ సాఫ్ట్‌వేర్‌తో పరిశీలిస్తే 84 మంది అర్హులు ఉండగా, క్షేత్రస్థాయి సర్వేలో 77 మంది తేలారు. పైలెట్ ప్రాజెక్టు సర్వే సందర్భంగా యాప్‌లో గుర్తించిన పొరపాట్లు సరిచేసినట్లు ఓ అధికారి చెప్పుకొచ్చారు.

**కమిటీలు ఆలస్యం..:** లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీల పాత్ర కీలకమనే ప్రచారం జరిగింది. ఒక్కో నియోజకవర్గంలో గ్రామ, మున్సిపాలిటీల్లో వార్డు స్థాయిలో జాబితా సిద్ధం చేసి ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదం పొందాలి. రెండు నెలలుగా దీనిపై కసరత్తు జరిగినా.. ఇప్పటి వరకు మూడు నియోజకవర్గాల జాబితాలే సిద్ధమయ్యాయి. రూరల్‌కు సంబంధించిన జాబితాకు ఆమోద ముద్ర పడింది. కమిటీల్లో స్థానిక పొదుపు సంఘం నుంచి ఇద్దరు మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాల నుంచి ఒక్కొక్కరు, మున్సిపాలిటీలో వార్డు అధికారి, పంచాయతీల్లో కార్యదర్శి, కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ కన్వీనర్‌గా, గ్రామాల్లో ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీల్దార్లు కన్వీనర్లుగా ఉంటారు. కమిటీల బాధ్యతలపై ఇంకా స్పష్టత లేదు. యాప్ ద్వారా ఎంపికలు పూర్తయ్యాక.. గ్రామసభల్లో ఈ కమిటీలు తుది ఆమోదం తెలుపుతాయని చెబుతున్నారు.

# జర చూడాలి.. గట్టు వైపు..!

నార్కట్‌పల్లి : చెర్వుగట్టులోని శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి గుహాలయానికి తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వార్షిక బ్రాహ్మోత్సవాలు, నెలలోని ప్రతి అమావాస్యకు వస్తుంటారు. ఇంతటి ప్రాముఖ్యం ఉన్న ఆలయానికి ఘాట్ రోడ్డు ప్రధాన సమస్యగా మారింది. దీంతో కార్లతో పాటు ఇతర, భారీ వాహనాల్లో వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలి నడకన వచ్చే భక్తులు సైతం ఇరుకు మార్గంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



**ఘాట్ రోడ్డు ఇరుకుగా మారి..**
ప్రతి అమావాస్య నాడు రాత్రి బస చేసేందుకు 60 వేల మంది వరకు భక్తులు తరలివస్తారు. గుట్ట పరిసర ప్రాంతాల్లో నిద్ర చేసి మరుసటి రోజు తెల్లవారుజామున వెళ్తారు. దీంతో పాటు సోమవారం, సెలవు రోజుల్లో రద్దీ అధికంగా ఉంటుంది. ఘాట్ రోడ్డు ఇరుకుగా ఉండటంతో గుట్టకు ఇరువైపులా ఉన్న మార్గాలు యల్లారెడ్డిగూడెం, నందులు నుంచి వచ్చే వాహనాలను గుట్టకు సుమారు కిలోమీటర్ దూరంలోని వాహనాలను నిలిపివేస్తారు. అక్కడి నుంచి భక్తులు కాలి నడకన లేదా ఘాట్ రోడ్డు మార్గం ద్వారా గుట్టపైకి చేరుకుంటారు. కొందరు నడవలేని భక్తులు తప్పని పరిస్థితుల్లో గుట్ట కింద ఉన్న రాజగోపురం వద్ద ఉన్న ప్రైవేటు ఆటోలకు అధిక డబ్బులు చెల్లించి వెళ్తున్నారు. క్షేత్రానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారని భక్తులు విమర్శిస్తున్నారు. అమావాస్య రోజు వచ్చే వేలాది మంది భక్తులు బసకు సరైన ఏర్పాట్లు లేకపోవడంతో పరిసర ప్రాంతాల్లో నిద్ర చేస్తున్నారు. భారీ షెడ్డుల నిర్మాణంతో పాటు మరుగుదొడ్లు, మంచి నీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

# శిక్షణ ఉచితం.. ఉపాధికి ఊతం

జహీరాబాద్ : మహిళలు స్వయం ఉపాధి దిశగా మళ్లించాలన్న సదుద్దేశంతో కోల్‌ఇండియా లిమిటెడ్, వికాస్ సంస్థలు అడుగేశాయి. ఇలాంటి వారికి ఉచిత కుట్టు శిక్షణ ఇస్తున్నాయి. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో 800 మందికి ఉచిత శిక్షణ ఇవ్వాలన్న సంకల్పంతో ప్రణాళిక రూపొందించుకొని అడుగేశాయి. తొలివిడతలో ఆరు కేంద్రాలను తెరవగా, 180 మందికి ఇస్తున్న తర్ఫీదు ఇస్తున్నారు.

**ఆరు కేంద్రాల్లో..**కోల్‌ఇండియా సంస్థ.. సీఎస్ఆర్ నిధులతో అవసరమైన నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయించగా, ఆ సంస్థ కమిటీ సభ్యుడు



జహీరాబాద్‌కు చెందిన కె.లక్ష్మారెడ్డి చొరవతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వికాస్ సంస్థ సహకారంతో ఆరు కేంద్రాలను ఏర్పాటుచేశారు. జహీరాబాద్‌లోని మాణిక్‌ప్రభుమహేల, పస్తాపూర్, గౌసాబాద్‌లో రెండు చొప్పున వీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒక్కో చోట 30 మందికి చొప్పున కుట్టు, అల్లికలు తదితరవి నేర్పిస్తున్నారు. 3 నెలల పాటు శిక్షణ ఇచ్చి, ఉచితంగా కుట్టుయంత్రం సైతం అందిస్తారు. ఈ నెలలో తర్ఫీదు పూర్తికానుంది.

**మున్ముందు మరిన్ని..** మారుమూల ప్రాంతాలు, ప్రధానంగా చదువు రాని నిరక్షరాస్యులు, పేద కుటుంబాలకు చెందిన మహిళలు ఇంట్లోనే ఉంటూ ఉపాధిని పొందేలా తీర్చిదిద్దడమే లక్ష్యం. మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి వారికి ఉచితంగా కుట్టు మిషన్ అందిస్తాం. మున్ముందు మరిన్ని ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు చేస్తాం.కె.సురేందర్‌రెడ్డి, వికాస్ సంస్థ డివిజన్ కోఆర్డినేటర్

# నిబంధనలు పట్టించుకోరు.. పోలీసులు పట్టుకోరు




నిజామాబాద్ : నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే పోలీసులు వారి ఫొటోలు తీసి జరిమానాలు విధిస్తూంటారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ, ఈ చిత్రంలో యువకుడు తన వాహనానికి 'పోలీస్' అని రాయించి జరిమానాల నుంచి తప్పించుకునేందుకు నంబర్ ప్లేట్ కనిపించకుండా మాస్క్ తొడిగి నగర రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్నాడు. పూర్తిగా నిబంధనలు అతిక్రమించిన ఇలాంటి వాహనాలు పోలీసులకు కనిపించవని.. చిన్నచిన్న తప్పిదాలకే తమకు భారీగా జరిమానాలు వేస్తున్నారని ఇతర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల కుటుంబ సభ్యుల విషయంలో మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

# గోదాముల్లోనే ధాన్యం నిల్వ



హుజూర్‌నగర్ : భారీగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న నేపథ్యంలో వాటి నిల్వకు సమస్య రాకుండా ముందుగానే నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మార్కెట్ గోదాములను వాడుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ కోసం మిల్లులకు కేటాయిస్తారు. గత రెండు సీజన్‌ల ధాన్యం నిల్వలు మిల్లుల్లో ఉన్నాయని, ఇప్పుడు ధాన్యం దించుకునేందుకు స్థలం లేదని మిల్లర్లు చెబుతున్నారు. దీంతో కొన్న ధాన్యాన్ని మిల్లుకు కేటాయించి మార్కెట్ గోదాములో నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. మార్కెట్ గోదాములలో ఏ మిల్లుకు ధాన్యం కేటాయిస్తారో ఆ మిల్లుకు మార్కెట్ కమిటీ వారు స్థలం కేటాయిస్తారు. అలా కేటాయించిన స్థలంలో ధాన్యం నిల్వ చేస్తారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో కొన్ని మార్కెట్ గోదాములలో ధాన్యం దిగుమతి జరుగుతోంది. మార్కెట్ అధికారులు మాత్రం ఇంకా అధికారిక ఉత్తర్వులు రాలేదంటున్నా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధాన్యం దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు.

**రైతుల కోసం కేటాయించాల్సినవి..**
రైతులు తమకు మద్దతు ధర రాలేదని అనుకున్నప్పుడు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ కమిటీ గోదాములలో నిల్వ చేసుకునే వారు. నిల్వ చేసుకున్న ధాన్యానికి రుణం కూడా ఇచ్చేవారు. మొదటి 90 రోజులు ఉచితంగా నిల్వ చేసుకునే అవకాశం ఉంది. తరువాత అతి కొద్ది ఛార్జీతో రైతు మరికొంత కాలం నిల్వ చేసుకునే అవకాశం ఉండేది. కానీ ఇటీవలి కాలంలో రైతులు ఈ గోదాములలో నిల్వ చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. కొన్ని సందర్భాల్లో మిల్లర్లు వాడుకుంటున్న పరిస్థితి ఉంది.

**ప్రభుత్వ కార్యక్రమానికే..**ప్రస్తుతం ధాన్యం పండించిన రైతులకు మద్దతు ధర కల్పించడం, కొన్న ధాన్యాన్ని సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) చేసి తిరిగి పౌరసరఫరాలశాఖ రేషన్ దుకాణాల ద్వారా బియ్యం సరఫరా చేయడం జరుగుతోంది. ప్రస్తుతం అనూహ్యమైన ధాన్యం దిగుబడి రావడంతో ఆ ధాన్యం నిల్వ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మొత్తం వ్యవహారం ప్రభుత్వమే నిర్వహిస్తున్నందున ధాన్యం నిల్వకు మార్కెట్ గోదాములను ఉపయోగించాలని నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాలో 21 మార్కెట్‌లు ఉన్నాయి. ఇందులో కొత్తవి కాకుండా పాత మార్కెట్‌లన్నింటికీ గోదాములు ఉన్నాయి. వీటిని ప్రభుత్వమే.. అదీ రైతు ప్రయోజనం కోసమే వాడుకుంటున్నందున నిల్వ చేసిన ధాన్యానికి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయరాదని ప్రభుత్వం నిర్ణయించింది.

**సీఎంఆర్ ధాన్యానికి భద్రత..**
ఒత్తిడి చేసి అప్పగించడం వల్ల కొందరు మిల్లర్లు ధాన్యం తీసుకొని సొంత వ్యాపార అవసరాలకు అమ్ముకొని తరువాత సీఎంఆర్ పెట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ గోదాముల్లోనే ఉంచడం వల్ల తిరిగి ధాన్యం తీసుకు పోయేటప్పుడు పౌరసరఫరాల అధికారుల అనుమతి అవసరం ఉంటుంది. దీంతో ధాన్యం ఎత్తగానే బియ్యం కోసం అధికారులు మిల్లర్లను ఒత్తిడి చేసే అవకాశం ఉంటుంది. దీనివల్ల సీఎంఆర్ ధాన్యం పక్కదోవ పట్టకుండా ఉంటుందన్న ఆలోచన కూడా పౌరసరఫరాలశాఖ అధికారుల్లో ఉంది.

# మూడుముళ్ల బంధం.. మాయగాళ్ల గండం



హైదరాబాద్: సంతోష్‌నగర్‌కు చెందిన వ్యక్తికి వివాహ పరిచయ వేదికపై మహిళ పరిచయమైంది. ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగాక... ఆమె కుటుంబ ఖర్చులు, పుట్టినరోజులంటూ అతడి నుంచి రూ.5లక్షలు స్వాహా చేసింది. పెళ్లి ఊసెత్తగానే నానా గొడవ చేయటంతో ఆందోళనకు గురైన బాధితుడి తల్లి బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురై మరణించింది" మణికొండకు చెందిన ఓ యువతి పెళ్లయిన ఏడాదికే భర్త నుంచి విడిపోయారు. మరో జోడుకోసం వెతికే క్రమంలో మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో యువకుడి ప్రొఫైల్ చూసి వివరాలు సేకరించారు. ఇద్దరి మధ్య కొద్దిరోజులు వాట్సాప్ ఛాటింగ్స్.. మాటలు జరిగాక తన బ్యాంకు ఖాతా లావాదేవీలు నిలిపివేశారని, తదితర కారణాలు చూపుతూ 3 నెలల వ్యవధిలో రూ.4.5లక్షలు కాజేశాడు. ఆ తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. నిందితుడు పశ్చిమగోదావరిజిల్లాకు చెందిన వ్యక్తిగా తేలింది.

మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యే ప్రయత్నంలో యువతీ, యువకులు మాయగాళ్ల బారిన పడుతున్నారు. కొన్ని వివాహ పరిచయ వేదికలను అడ్డాగా మార్చుకున్న కేటుగాళ్లు నకిలీ ఫొటోలు, చిరునామాలతో బురిడీ కొట్టిస్తున్నారు. మరోవైపు కొందరు కిలేడీలు తామే కాబోయే పెళ్లికూతుళ్లమంటూ అబ్బాయిలకు దగ్గరై సొమ్ము కొట్టేస్తున్నారు. ఎవరైనా నిలదీస్తే పెళ్లి పేరిట తమనే మోసగించారంటూ ఠాణాల్లో ఫిర్యాదు చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు నగర పరిధిలో 50కు పైగా పెళ్లిపేరిట మోసపోయినట్లు ఫిర్యాదులు అందాయి. ప్రత్యక్షంగా వధూవరులను చూడకుండా నిర్ణయం తీసుకోవద్దని... నగదు ముందుగానే కావాలంటున్నారంటే మోసపోతున్నట్లు గుర్తించాలని పోలీసులు సూచిస్తున్నారు.సామాజిక మాధ్యమాలు, వెబ్‌సైట్లలో నకిలీ ప్రొఫైల్స్‌తో మోసాలకు పాల్పడే ముఠాలు రెండురకాలుగా బురిడీ కొట్టిస్తున్నారు. కొందరు విదేశాల్లో ఉంటున్న ప్రవాస భారతీయులుగా పరిచయం చేసుకుంటారు. మరోతరహా కేటుగాళ్లు ఏపీ, తెలంగాణల్లో ఫలానా కుటుంబాలకు చెందిన వారీగా పరిచయం చేసుకుంటారు.

# ఆయిల్‌పాం సాగు.. ధర బాగు



చేగుంట: దీర్ఘకాలంగా దిగుబడులు ఇచ్చే ఆయిల్‌పాం సాగు చేయాలని ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది. సాగు చేస్తున్న కర్షకులకు ప్రోత్సాహకాలను అందజేస్తోంది. దీంతో సాగు చేసేందుకు ఔత్సాహికులైన రైతులు ముందుకు వస్తున్నారు. కానీ ధర విషయంలో సందేహాలు ఉండటంతో నిరాశలో ఉండిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో దీని ధర పెరుగుతూ వస్తోంది.

**మరో ఏడాదిలో దిగుబడి**
జిల్లాలో చాలా బీడు భూములు ఉన్నాయి. వాటిలో ఆయిల్‌పాం సాగు చేస్తే లాభాలను ఆర్జించవచ్చు. ప్రస్తుతం టన్ను ధర రూ.20,413 ఉండటంతో సాగు చేస్తున్న రైతులు ఆనందంగా ఉన్నారు. ఉద్యానవనాధికారులు మూడేళ్ల నుంచి సాగును ప్రోత్సహిస్తున్నారు. మూడేళ్ల క్రితం నాటిన మొక్కలు మరో ఏడాదిలో దిగుబడులను ఇవ్వనున్నాయి. మొదట్లో అన్నదాతలు సాగు చేసేందుకు అంతగా ఆసక్తి చూపించలేదు. కానీ రానురాను వారిలో మార్పు కనిపిస్తోంది.

**ప్రభుత్వ ప్రోత్సాహం**
రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పాంను సాగు చేయాలని చెబుతున్నా.. ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. ఉద్యానవనాధికారులు ఎకరానికి 50 మొక్కలు ఇచ్చి మూడేళ్ల నిర్వహణకు రాయితీని కూడా అందజేస్తున్నారు. జిల్లాలో ఏటా 2 వేల ఎకరాల్లో మొక్కలు నాటించాలని లక్ష్యంగా నిర్దేశించారు. 2023-24లో ఐదు వేల ఎకరాల్లో సాగు చేయాలని భావించారు. కానీ చాలా తక్కువ ఎకరాల్లో సాగుచేశారు. ఈ సంవత్సరం 2000 ఎకరాల్లో సాగు చేయాలని అనుకున్నారు. అందుకు 1560 మంది రైతులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇందులో 900 ఎకరాలకు రైతు వాటా డబ్బులు చెల్లించారు. ఇప్పటి వరకు 275 ఎకరాల్లో సాగుచేశారు.


**మంచి ఆదాయం**
ఆయిల్‌పాం మొక్కలు నాటిన నాలుగో సంవత్సరం నుంచి 25 ఏళ్ల వరకు పంట తీసుకోవచ్చు. ఎకరానికి 12 టన్నుల దిగుబడి వస్తుంది. టన్నుకు రూ.20 వేలు వచ్చినా.. పెట్టుబడులు పోను ఎకరానికి రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది. అంతేకాకుండా నాలుగేళ్ల పాటు అంతర పంటగా వివిధ రకాల పంటలను సాగు చేసుకోవచ్చు. నాలుగేళ్లు కూడా ఆదాయం పొందేందుకు అవకాశం ఉంది.

**పెరుగుతున్న డిమాండ్**
అంతర్జాతీయ స్థాయిలో పామాయిల్‌కు బాగా డిమాండ్ ఉంది. ఇండోనేసియా, మలేసియా నుంచి దిగుబడులు చేసుకోవాల్సి వస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లోనే సాగు చేపట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. గత ఏడాది ధర చాలా తగ్గిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందారు. ఈసారి మాత్రం ప్రారంభంలో రూ.13 వేలు ఉండగా ప్రస్తుతం రూ.20 వేలకు చేరింది. దీనివల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

# నేతన్నల సంక్షేమానికి 'చేనేత అభయహస్తం'

చౌటుప్పల్ : 'కళాత్మకమైన చేనేత వస్త్రాలను మగ్గాలపై నేసే కళాకారులు యాదాద్రి భువనగిరి జిల్లాలోనే అధిక సంఖ్యలో ఉన్నారు. ఇక్కడ చేనేత కళాకారులు రూపొందించే పోచంపల్లి పట్టుచీర, పుట్టపాక తేలియా రుమాల్ జాతీయస్థాయిలో భౌగోళిక గుర్తింపును పొందాయి. జిల్లాలో ఇక్కత్ డిజైన్లతో నేసే వివిధ రకాల వస్త్రాలకు అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది. చేనేత కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తుంది. మగ్గం నేసే కార్మికులను గుర్తించి జియోట్యాగింగ్ చేసి ప్రత్యేకమైన నెంబరును చేనేత, జౌళిశాఖ ద్వారా కేటాయించారు. చేనేత సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం 'చేనేత అభయహస్తం' పేరుతో అమలు చేయనున్నట్టు ప్రకటించిందని'.. ముఖాముఖిలో చేనేత, జౌళిశాఖ జిల్లా సహాయ సంచాలకుడు కామిల్ మహమ్మద్ వివరించారు.

**జిల్లాలో ఎంతమందిని గుర్తించారు?**
కామిల్: వస్త్రాలను నేసే చేనేత మగ్గాలను, కళాకారులను గుర్తించి వాటికి జియోట్యాగింగ్ చేశాం. జిల్లాలో 6771 చేనేత మగ్గాలకు,



2240 మర మగ్గాలకు జియోట్యాగింగ్ చేసి ప్రత్యేక నెంబర్లు కేటాయించాం. సహకార చట్టం కింద ఏర్పాటైన 48 చేనేత సంఘాలున్నాయి. ఇంకా ఎవరైనా మగ్గం నేస్తున్నవారు జియోట్యాగింగ్ కాకుండా మిగిలుంటే మా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో పరిశీలించి, విచారణ నిర్వహించి ట్యాగింగ్‌కు సిఫార్సు చేస్తాం.

**నేతన్నకు చేయూత పథకం అమలవుతుందా?**
కామిల్: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా 'నేతన్నకు చేయూత' పేరుతో పొదుపు పథకం అమలైంది. నేత కార్మికులు తమ వేతనంలో 8శాతం పొదుపు ఖాతాలో జమచేస్తే ప్రభుత్వం దానికి రెట్టింపు 16శాతం జమచేసింది. మూడేళ్ల కాల వ్యవధి ఇటీవల పూర్తవడంతో ఈ పథకంలో చేరిన 11389 మందికి రూ.68.59 కోట్లు వారి ఖాతాల్లో జమచేశాం. ఈ పథకం పునరుద్ధరణకు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఆదేశాలు అందలేదు.

**ఇక్కడి కళాకారులు ఏ రకం వస్త్రాలను తయారు చేస్తారు?**
కామిల్: 'ఇక్కత్' అనేది అంతర్జాతీయంగా గుర్తింపున్న చేనేత కళ.. జిల్లాలో ఈ డిజైన్లతో పట్టు, నూలు, మస్రైజ్డ్ చీరలు, డ్రెస్ మెటీరియల్, దుపట్టాలు, బెడ్‌షీట్లు, రుమాళ్లు, చేతి రుమాళ్లు మగ్గాలపై నేస్తుంటారు. వీటిని సహకార సంఘాల, 'టెస్కో' ద్వారా కొనుగోలు చేసి షోరూముల్లో, వస్త్ర ప్రదర్శనశాలల్లో విక్రయిస్తుంటారు. అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు టెస్కో ద్వారానే వస్త్రాలు కొనుగోలు చేయాలని ఇటీవల ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

**నేతన్న బీమా పథకం అందరికీ వర్తిస్తుందా?**
కామిల్: జియోట్యాగ్ మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడికి, ఆ మగ్గంతో నమోదైన అనుబంధ కార్మికులకు నేతన్న బీమా పథకం వర్తిస్తుంది. ఇప్పటివరకు 18 నుంచి 59 ఏళ్ల వయో పరిమితి ఉండేది. ఈ పథకంలో నమోదైన చేనేత కార్మికుడు మరణిస్తే అతని నామినీకి ఎల్ఐసీ ద్వారా రూ.5లక్షలు బీమా అందేది. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 14 నుంచి వయో పరిమితిని తొలగించింది. 59 ఏళ్ల పైబడి వయసున్న చేనేత కార్మికులు మరణిస్తే చేనేత, జౌళిశాఖ బీమా పరిహారం అందించాలని నిర్ణయించారు. ఈ పథకంలో ప్రస్తుతం 10686 మంది నమోదై ఉన్నారు.

# పింఛన్లకు ఎదురుచూపులు

గజ్వేల్ : జిల్లాలో ఆసరా పింఛన్ల కోసం వందల మంది ఎదురుచూస్తున్నారు. నాలుగేళ్లుగా కొత్త వాటికి మంజూరు ఇవ్వకపోవడంతో దరఖాస్తులు పెట్టుకున్న వారు ఆర్థిక చేయూత లేక యాతన పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు నిత్యం కార్యాలయాలు, రాజకీయ నాయకుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు.నిరుపేదలకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న విషయం తెల్సిందే. ఇందులో భాగంగా



వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, బీడీ, గీతా కార్మికులు, నేతన్నలకు ప్రభుత్వం నెలనెలా రూ.2016 నుంచి రూ.3016 వరకు పింఛన్లు అందిస్తోంది. అర్హులైన పేదవారు దరఖాస్తు చేసుకున్న వంద రోజుల్లో కొత్త పింఛన్లు అందిస్తామని గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించినా అమలు చేయలేదన్న విమర్శలున్నాయి. తాము అధికారంలోకి వస్తే కొత్త వాటితో పాటు పాతవి రెట్టింపు చేస్తామన్న నేతలు కూడా ఇంకా వీటిపై దృష్టి సారించడం లేదు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో వందల మంది పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. **వృద్ధుడు మృతి చెందితే ఆయన భార్యకు..**కొత్త పింఛన్ల మంజూరులో శ్రద్ధ చూపని సర్కారు ఏ ఇంట్లోనైనా పింఛన్ అందుకునే వృద్ధుడు మృతి చెందితే అతడిది రద్దు చేసి భార్యకు వితంతు పింఛన్ కింద మార్చి ఇస్తున్నారు కానీ కొత్తవి మాత్రం ఇవ్వడం లేదు.

# ధాం.! దాం..

హైదరాబాద్: దీపావళి వేళ కూరగాయలు, నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. భారీగా పెరిగిన ధరలతో మధ్యతరగతి ప్రజల జేబులు గుల్లవుతున్నాయి. నెలలోనే పండగ బడ్జెట్ 30నుంచి 40శాతం పైగా పెరిగిందని సామాన్య, మధ్యతరగతి ప్రజలు వాపోతున్నారు. రెండు, మూడు రోజులుగా పెరిగిన ధరల భారంతో ఆందోళన చెందుతున్నారు.

**నూనెలు సలసల.. పప్పులు కుతకుత**

పాతవి, నాణ్యమైన బియ్యం కిలో రూ.60కు పైనే ఉన్నాయి. పప్పులు రూ.100లోపు లేవు. గతనెల శనిగపప్పు కిలో రూ.64 నుంచి రూ.68 ఉండగా.. ప్రస్తుతం రూ.101గా ఉంది. మినపప్పు రూ.125 ఉండగా.. కందిపప్పు రూ.170కు చేరింది. బెల్లం రూ.55-రూ.70 దాకా ఉంది. లీటరు సన్‌ఫ్లవర్ నూనె కనీస ధర రూ.134 ఉంది.

**కూరగాయల రేట్లు ఇలా..**

ఏ కూరగాయ అయినా రైతుబజారులోనే రూ.60కంటే ఎక్కువగా ఉండగా.. రిటైల్‌లో రూ.80నుంచి రూ.100 దాకా ఉన్నాయి. టమాటా మాత్రం కిలో రూ.20నుంచి రూ.30 దాకా ఉంది. బెండకాయ, వంకాయ, దొండకాయ, క్యారెట్, బీర అన్నీ రూ.60 నుంచి రూ.70 దాకా ఉన్నాయి. బీన్స్ రైతు బజార్‌లోనే రూ.120 ఉండగా రిటైల్‌లో రూ.140కి పైగానే ఉంది. ఆలు రూ.35నుంచి 50 దాకా ఉంది. వెల్లుల్లి రూ.400కు దిగి రావడం లేదు.

**పరిమితంగా కొనుగోళ్లు**



ధరల పెరుగుదల ప్రభావం అమ్మకాలపై పడిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. గతంలో కిలోల్లో కొనేవారు ఇప్పుడు అరకిలే తీసుకుంటున్నారని కూరగాయలు విక్రయించే రైతు శ్రీరాములు అన్నారు. కూరగాయల లభ్యత తగ్గడంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా పరిమితంగా వస్తుండటంతోనే ధరలు పెరుగుతున్నాయన్నారు.

**ధర చూస్తే భయమేస్తోంది**

పండగ సరకుల ధరలు చూస్తే భయమేస్తోంది. సరకుల లిస్టులో అన్నీ కొనే పరిస్థితి లేదు. నెల క్రితం సరకుల వ్యయం రూ.3000 అయితే.. ఈసారి అవే సరకులకు రూ.4,100 దాకా చెల్లించాల్సి వచ్చింది. హెూల్‌సేల్ షాపులోనే ఇలా ఉంటే ఇక చిల్లర దుకాణాల్లో ఇంకా ఎక్కువగా ఉన్నాయి.

చంద్రశేఖర్, విశ్రాంత ఉద్యోగి, కూకట్‌పల్లి

**రూ.700 ఖర్చయినా బ్యాగ్ నిండలేదు**

రైతుబజార్‌లోనే రూ.700కు కూరగాయలు కొంటే కనీసం సంచికూడా నిండలేదు. తక్కువ పరిమాణంలో కొన్నా గతం కంటే రెట్టింపు చెల్లించాల్సి వచ్చింది. వారం, పది రోజులుగా ఇదే పరిస్థితి. పండగ వేళ ఎక్కువ కొందామనుకుంటే రేట్లు చూసి పరిమితంగానే కొన్నాము.

ప్రమీల, గృహిణి, సనత్‌నగర్

# హుస్నాబాద్ ఆసుపత్రి ఉన్నతీకరణ

హుస్నాబాద్: హుస్నాబాద్ వంద పడకల ఆసుపత్రిని 250 పడకలకు ఉన్నతీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆసుపత్రి నిర్మాణానికి, ఉపకరణాల కోసం రూ.82కోట్లు మంజూరు చేసింది. దీంతో ఈ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మంజూరుతో హుస్నాబాద్ వైద్య కళాశాల ఏర్పాటుకు మార్గం సుగమం కానుందని భావిస్తున్నారు.

**అన్ని రకాల సేవలు**

ప్రస్తుత సామాజిక ఆరోగ్య కేంద్రం 50 పడకలతో కొనసాగుతోంది. మరో 50 పడకలతో మాతాశిశు ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ప్రస్తుతమున్న వంద పడకలను 250 పడకలకు ఉన్నతీకరణ చేయడం వల్ల వైద్య కళాశాలకు అనుబంధంగా ఉంటుందని చెబుతున్నా రు. వెనుకబడిన, గిరిజన ప్రాంతమైన హుస్నాబాద్‌లో 250 పడకల ఆసుపత్రి వస్తే మెరుగైన చికిత్సలు, సదుపాయాలు లభించనున్నాయి. ప్రస్తుతం



పూర్తిస్థాయి సేవలు లభించకపోవడంతో దాదాపు 50కి.మీ దూరంలో ఉన్న వరంగల్, కరీంనగర్, సిద్దిపేట పట్టణాలకు రోగులు వెళ్లాల్సి వస్తోంది. కొత్తగా ఏర్పాటు అయ్యే ఆసుపత్రితో స్థానికంగానే అన్ని రకాల వైద్య సేవలు, చికిత్సలు లభించే అవకాశం ఉంది.

**వైద్య కళాశాలకు అడుగులు**

ప్రధానంగా హుస్నాబాద్‌లో వైద్య కళాశాల ఏర్పాటు లక్ష్యంగానే ఆసుపత్రి ఉన్నతీకరణ చేసినట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హుస్నాబాద్‌లో వైద్య కళాశాల ఏర్పాటు చేస్తామని ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకగాంధీ హామీ ఇచ్చారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్.. వైద్య కళాశాల ఏర్పాటుపై కసరత్తు ప్రారంభించారు. అవసరమైన స్థల సేకరణకు హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో పరిశీలన జరిగింది. చివరకు హుస్నాబాద్ మండలంలో పోతారం(ఎస్)-జిల్లెల్లగడ్డ గ్రామాల మధ్య స్థల సేకరణ చేశారు. ఇందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు నివేదించారు. జిల్లా కలెక్టర్ సైతం ఈ స్థలాన్ని పరిశీలించారు. వైద్య కళాశాల మంజూరు కావాలంటే కనీసం 250 పడకల ఆసుపత్రి ఉండాలనే నిబంధన ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ముందుగా ఆసుపత్రిని ఉన్నతీకరణ చేసిన తర్వాతే వైద్య కళాశాల ఏర్పాటుకు ముందుకు సాగుతామని మంత్రి ప్రభాకర్ గతంలో వెల్లడించారు. ఈ క్రమంలోనే 250 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇది పూర్తయితే వైద్య కళాశాలకు మంజూరు లభించనుంది.

**సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి పొన్నం** హుస్నాబాద్ ఆసుపత్రిని 250 పడకల ఉన్నతీకరణకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.

# ఆవిష్కరణలకు ఊతం.. అన్నదాతకు ప్రయోజనం



తాండూరు : తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్మించిన అగ్రిహబ్ భవనం అందుబాటులోకి వచ్చింది. నాబార్డు చీఫ్‌జనరల్ మేనేజర్ సుశీల, వ్యవసాయ శాస్త్రవేత్తలు భవనాన్ని ఇటీవల ప్రారంభించారు. సేద్య సంబంధమైన వ్యాపార కార్యకలాపాలు, అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి రైతుల ఆర్థిక అభ్యున్నతికి నిపుణులు సూచనలు, సలహాలను అందించనున్నారు.

జిల్లాలోని 2.96 లక్షల మంది రైతులు వానాకాలం, యాసంగిలో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. వీటి ఉత్పత్తులను విక్రయిస్తే నామమాత్ర లాభాలే వస్తున్నాయి. ఒక్కోసారి నష్టాలు తప్పడంలేదు. ఇటువంటి పరిస్థితిలో కందులు, పెసలు, మినుములు, కుసుమ, జొన్నలు, వేరుసెనగ, చిరుధాన్యాలు, ఉల్లిపాయలు, సోయాబీన్స్ వంటి తదితర పంటల నుంచి ఆహార ఉత్పత్తులు, అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఆర్థికంగా ఎలా లాభపడవచ్చనే విషయాలను వివరిస్తారు. సదరు పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి రుణాలను బ్యాంకుల నుంచి ఎలా పొందవచ్చనే సలహాలు ఇస్తారు. నేషనల్ బ్యాంక్‌ఫర్ అగ్రికల్చర్, రూరల్‌డెవలప్‌మెంట్ (నాబార్డ్) అండగా ఉంటుంది.

**అనుబంధరంగాలు..**

జొన్నలు పండించే వారు రవ్వ తయారు చేయవచ్చు. కుసుమల నుంచి నూనె కాకుండా, పప్పును ఉత్పత్తి చేసి పచ్చళ్లను తయారు చేయవచ్చు. చిరుధాన్యాలతో ఆహార ఉత్పత్తులు, కందులు, పెసలు, మినుములను పప్పుగా మార్చి విక్రయిస్తే రెట్టింపు లాభాలు పొందవచ్చు. పప్పులతో పచ్చళ్లు, ఇతర ఆహార పదార్థాలుగా తయారు చేసి విక్రయిస్తే ఆదాయం ఉంటుంది. ఉత్పత్తుల గ్రేడింగ్, అసెంబ్లింగ్, ప్రామాణీకరణ, ప్రాసెసింగ్, ప్యాకింగ్, పంపిణీ వంటి విషయాలను వివరిస్తారు. రైతుల ఆలోచనలు ప్రోత్సహిస్తారు

**పరికరాలతో అవగాహన:** అగ్రిహబ్ భవనంలో వివిధ రకాల వ్యవసాయ గింజల నుంచి అనుబంధ ఉత్పత్తులు ఎలా తయారు చేయాలనే విషయంలో అవగాహన కల్పించేందుకు అవసరమైన పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. భవనంలోని ప్రత్యేక హాల్‌లో రైతులతో సమావేశాలు నిర్వహించగానే గింజల నుంచి ఉత్పత్తులను ఎలా తయారు చేయవచ్చనే విషయాన్ని ప్రత్యక్షంగా చూపిస్తారు.

**ఉత్పత్తుల విలువను పెంచేందుకే**

రైతులు పండించే ఉత్పత్తులకు విలువ ఏ విధంగా పెంచుకోవాలనే విషయంలో అగ్రిహబ్‌లో నిపుణులు సూచనలు, సలహాలు ఇస్తారు. కొన్ని పరికరాలు రావాల్సి ఉంది. వీటి ద్వారా ఉత్పత్తులను ఎలా తయారు చేయవచ్చో వివరిస్తాం. కోఆర్డినేటర్, శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటారు. డాక్టర్ సుధారాణి, ప్రధాన శాస్త్రవేత్త

**భవనానికి ఇలా..**

చేసిన వ్యయం: రూ.1.60 కోట్లు

నిర్మాణం: జి+1

అంతర్భాగం గదులు: అల్యూమినియం, ఫైబర్ గ్లాసులు

విభాగాలు: రిసెప్షన్, మీటింగ్ హాల్, వెయిటింగ్ హాల్, కోఆర్డినేటర్ గది.

ప్రత్యేక గదులు: శాస్త్రవేత్తలకు

వసతులు: తాగు నీరు, శౌచాలయాలు

అక్షరాస్య, నిరక్షరాస్య రైతులకు అవగాహనకు: దృశ్య మాధ్యమం

# ఎవరిది బాధ్యత.. ఎందుకీ నిర్లిప్తత..?



హైదరాబాద్ : నగరానికి తలమానికంగా నిలిచిన మెట్రో రైల్వేస్టేషన్ల పరిసరాల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. అంతర్జాతీయ స్థాయిలో నిర్మాణం చేపట్టి.. నిర్వహణపరంగా హైదరాబాద్ మెట్రోరైలు (హెచ్ ఎంఆర్) సంస్థ రాజీపడుతోందనే విమర్శలు వస్తున్నాయి. అత్యాధునిక సదుపాయాలతో మెట్రో పరుగులు పెడుతున్నా.. పలు శాఖల నిర్లక్ష్యం కారణంగా అపఖ్యాతి తప్పడం లేదు. స్టేషన్ల చుట్టు పక్కల అధ్వాన పరిస్థితులు ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పాదబాటల టైల్స్ పగిలిపోవడం.. మురుగుపారడం, మెట్ల మార్గానికి అడ్డంగా వాహనాల పార్కింగ్.. దుమ్ము ధూళి, చెత్తతో నిండిపోవడం వరకు నిర్వహణ సమస్యలు వేధిస్తున్నాయి. నగరంలోని పలు స్టేషన్లను పరిశీలించగా.. అనేక సమస్యలు, లోపాలు వెలుగులోకి వచ్చాయి. నగర ప్రజారవాణాలో కీలకంగా మారిన మెట్రోకి ప్రయాణికుల నుంచి ఆదరణ రోజురోజుకూ పెరుగుతోంది. స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండాలని ఒక్కో స్టేషన్ దగ్గర అటుఇటు 600 మీటర్ల వరకు రూ.2కోట్ల వ్యయంతో సుందరీకరణ పనులు చేపట్టారు. వీటి నిర్వహణను హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ చూస్తోంది. మొదట్లో బాగానే ఉన్నా అధికారుల పర్యవేక్షణ లోపంతో క్రమంగా అంతర్జాతీయ స్థాయి నుంచి లోకల్ స్థాయికి పడిపోయింది.

**మచ్చుకు ఇలా..**

సికింద్రాబాద్ నుంచి కోఠి వెళ్లే మార్గంలో ముషీరాబాద్ స్టేషన్ కింది భాగంలో పాదబాట పక్కన బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్నారు.

గాంధీ ఆసుపత్రి స్టేషన్ వద్ద లిఫ్ట్ మార్గం వద్ద మురుగునీరు నిలిచి అపరిశుభ్రంగా మారింది. వాహనాలు అడ్డంగా నిలుపుతున్నారు.

చిక్కడపల్లి మెట్రోస్టేషన్ పాదబాటలపై టైల్స్ పగిలిపోయాయి.

నారాయణగూడ బ్రిడ్జి వద్ద మెట్రో వయాడక్ట్ కింద దుకాణాలు నిర్మిస్తున్నారు. పాదబాట లేక ప్రయాణికులు ప్రమాదకరంగా రహదారిపై నడుస్తున్నారు.

ఉప్పల్ మెట్రోస్టేషన్ పాదబాటలో టైల్స్ పగిలిపోయాయి.

కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ పాదబాటలను చిరు వ్యాపారులు ఆక్రమించారు. వాటిపై సామగ్రిని నిల్వ చేస్తున్నారు.

గాంధీభవన్ స్టేషన్ ప్రవేశ మార్గం పాదబాటలపై ద్విచక్రవాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. చిరు వ్యాపారులు కౌంటర్లు ఏర్పాటు చేసుకున్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లో స్టేషన్‌లోకి వెళ్లే మార్గంలోనే వాహనాలు అడ్డుగా పెడుతున్నారు.

నిర్వహణ కోసం కేటాయించిన దుకాణాలు కొన్ని వారికి కేటాయించిన స్థలాన్ని మించి పాదబాటలపై విస్తరిస్తున్నాయి. హైటెక్‌సిటీ, జేఎన్‌టీయూతోపాటు పలు ప్రాంతాల్లో నిర్వహణ కోసం కేటాయించిన దుకాణదారులు పాదబాటలను సైతం ఆక్రమిస్తున్నారు.

**ఎల్ అండ్ టీ పట్టనట్లుగా..**

కారిడార్ వెంట, స్టేషన్ల కింద పచ్చదనం బాధ్యత ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైలు సంస్థది. డివైడర్లను నాసిరకంగా నిర్మించడంతో మూడు కారిడార్లలో పగుళ్లు వచ్చాయి. ఇటుకలు ఊడిపోయాయి. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టడం లేదు. రంగులు వెలిసిపోయినా వేయడం లేదు. భద్రతా కోసం డివైడర్ అడుగు భాగంలో ఏర్పాటు చేయాల్సిన రేడియం స్ట్రిప్స్‌ను ఎప్పుడో మర్చిపోయింది. మిగతా చోట్ల పచ్చదనం నిర్వహిస్తున్నా స్టేషన్ల కింది భాగాన్ని పూర్తిగా వదిలేసింది. డివైడర్లపై లాలీపాప్స్ యాడ్స్‌తో ఆదాయం పొందుతున్నా పచ్చదనాన్ని మాత్రం పట్టించుకోవడం లేదు.

**ఇతర విభాగాలూ వదిలేశాయ్..**

స్టేషన్ల పరిసరాల వరకు హెచ్ఎంఆర్ చూస్తుండగా.. ఆ ప్రాంతంలోని రహదారి, ఇతర పనులను జీహెచ్ఎంసీ, జలమండలి, ఇతర శాఖలదే బాధ్యత. స్టేషన్ల వద్ద హెచ్ఎంఆర్ చూసుకుంటుందని ఈ శాఖలు పూర్తిగా వదిలేశారు.జేఎన్టీయూ మెట్రో స్టేషన్‌ను ఆనుకొని ఉన్న సర్వీస్‌రోడ్డు గతుకులమయంగా మారింది.

జూబ్లీహిల్స్ స్టేషన్ కింద ఎప్పుడు మురుగునీరు పారుతూ ఉంటుంది. జలమండలి పట్టించుకోవడం లేదనే ఫిర్యాదులున్నాయి.

వైజంక్షన్ వద్ద ఉన్న బాలానగర్ స్టేషన్ సర్వీస్ రహదారిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేయడం లేదు.

మెట్రో మార్గం 69.2 కి.మీ.

మొత్తం కారిడార్లు 3

స్టేషన్లు: 57

నిత్యం రాకపోకలు సాగించే వారి సంఖ్య 5 లక్షలు

# జోరుగా వేరుసెనగ సాగు

బషీరాబాద్: జిల్లాలో వేరుసెనగ సాగు ఊపందుకుంది. ఆశించిన మేరకు ఈ ఏడాది వర్షాలు కురవడంతో రబీ సాగుకు అనువుగా ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం విత్తనాలు సరఫరా చేయకపోవడంతో కర్ణాటక నుంచి విత్తనాలు తెచ్చుకోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లో వేరుసెనగ 11,668 ఎకరాల్లో సాగు ఉంటుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. రైతులు ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి మేలు రకమైన వేరుసెనగ విత్తనాలను తీసుకొచ్చి సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు 60శాతం సాగు పూర్తికావస్తోంది. ముఖ్యంగా యాసంగిలో కంది, పెసర, మినుము పంటలు వేశాక, వేరుసెనగ సాగు చేస్తున్నారు. వరి రెండు పంటలకు నీరు అందని బోరుబావుల కింద సైతం ఈసారి ఈ పంట సాగవుతోంది. పెద్ద ప్రాజెక్టులు, చెరువుల ఆయకట్టు భాగంలో, కోట్‌పల్లి, జుంటిపల్లి ప్రాజెక్టుల పరిధిలోని ఎర్ర నేలల్లో సాగు జోరుగా సాగుతోంది. బషీరాబాద్ మండలంలోని బాద్లాపూర్, మైల్వార్, రెడ్డిఘనాపూర్, మండలంలోని గిరిజన తండాల్లో గతేడాదికంటే అధికంగా సాగు చేస్తున్నారు.



**విత్తనశుద్ధి తప్పనిసరి :** రుద్రమూర్తి, ఏడీఏ, తాండూరు

వేరుసెనగ సాగు చేసుకునేందుకు నవంబరు 15 వరకు సమయం ఉంది. తేమ, అదును చూసి విత్తనాలు వేసుకోవాలి. తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలి. చీడపీడల నివారణకు ఇది దోహదం చేస్తుంది.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కమిషన్

## గడువు మరోసారి పొడిగింపు?

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను నియమించింది. దీనిపై వంద రోజుల్లో విచారణ పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అందుకు అనుగుణంగా జస్టిస్ పీసీ ఘోష్ విచారణ కొనసాగిస్తున్నారు. కాగా, మొదటి వంద రోజుల గడువు జూన్ నెలాఖరుతో పూర్తయింది. దీనిపై విచారణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రెండుసార్లు రెండు నెలల చొప్పున కమిషన్ గడువును పొడిగించింది. ప్రభుత్వం



పొడిగించిన గడువు నేటితో పూర్తికానుంది.

అయితే, జస్టిస్ పీసీఘోష్ కమిషన్ విచారణ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఇంజినీర్లు, విశ్రాంత ఇంజినీర్లకు సంబంధించిన క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తయింది. ఐఏఎస్ అధికారులు, మాజీ ఐఏఎస్ అధికారులను కమిషన్ విచారించాల్సి ఉంది. విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, కాగ్ నివేదికల ఆధారంగా ఇతర అంశాలపైనా విచారణ జరపాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అప్పటి ప్రభుత్వపెద్దలను కూడా దర్యాప్తు చేసేందుకు కమిషన్ సిద్ధమవుతోంది. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పీసీఘోష్ కమిషన్ గడువును మరోసారి పొడిగించనుంది. సంబంధిత దస్త్రం ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. మరో రెండు నెలలపాటు పొడిగింపు ఇస్తూ ఇవాళో.. రేపో ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉంది.

# పట్టణీకరణ దిశగా అడుగులు

మెదక్: మెతుకుసీమ ఇక అభివృద్ధి బాటలో పయనించనుంది. రెండు పురపాలికలు, పలు రెవెన్యూ గ్రామాలను కలుపుతూ పట్టణాభివృద్ధి సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో ఆయా గ్రామాలకు నిధులు వచ్చే అవకాశం ఉంది. సంస్థ ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్ జారీ కాగా, త్వరలో అథారిటీ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ మొదలుకానుంది.

జిల్లా రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉండడంతో కొంత మేర అభివృద్ధికి అవకాశం కలగగా... గ్రామీణ ప్రాంతాల్లో కాస్త వెనకబాటు ఉంది. ఈ క్రమంలోనే ప్రభుత్వం మెదక్ పట్టణాభివృద్ధి సంస్థ(ముడా) ఏర్పాటు చేసింది. జిల్లాలో నర్సాపూర్, శివ్వంపేట, తూప్రాన్, మనోహరాబాద్ మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉన్నాయి. వీటిని వదిలేసి మిగిలిన మెదక్, రామాయంపేట మున్సిపాలిటీలతో పాటు 17 మండలాల్లోని 289 రెవెన్యూ గ్రామాలతో పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటైంది. రహదారులు, నీటి సరఫరా, ఉపాధి అవకాశాలు, శాటిలైట్ టౌన్‌షిప్‌ల పెరుగుదలే సంస్థ లక్ష్యం.

**పెరగనున్న కేంద్ర నిధులు...**

మౌలిక వసతుల కల్పన, నిర్వహణ మెరుగవ్వాలి. అందుకు నిధులు దండిగా అవసరం. ముడా ఏర్పాటుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సమృద్ధిగా సమకూరే అవకాశం ఉంది. గ్రామాల్లో లేఅవుట్లు, భవన నిర్మాణం, పారిశ్రామిక తదితర కీలక అనుమతులు దీని పరిధిలోకి రానున్నాయి. అక్రమ, అనుమతి లేని లే అవుట్‌లకు కళ్లెం పడనుంది. ఫలితంగా ఆదాయం పెరగనుంది. పట్టణ మాదిరి గ్రామాల్లోనూ సౌకర్యాలు పెంచనున్నారు.

**మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు అవకాశం**

ఇప్పటి వరకు జిల్లాలో ఉన్న పట్టణాలకు మాస్టర్ ప్లాన్ రూపొందించలేదు. మెదక్ మున్సిపాలిటీకి మాత్రం ఏళ్ల క్రితం నాటిదే ఉంది. మూడేళ్ల క్రితం కొత్తది రూపొందించగా పలు మార్పులు చేయాలని వినతులు రాగా గత ప్రభుత్వం ఆమోద ముద్ర వేయలేదు. ప్రస్తుతం జిల్లా పరిధినే యూనిట్‌గా పట్టణాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాల్లో మాస్టర్‌ప్లాన్ రూపొందించే అవకాశం కలగనుంది.

**కలెక్టర్ చైర్మన్‌గా కమిటీ...**

ముడా చైర్మన్‌గా కలెక్టర్, వైస్ చైర్మన్‌గా అదనపు కలెక్టర్ వ్యవహరించనున్నారు. ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ లేదా వారి నామినిలు సభ్యులుగా ఉంటారు. ఇది వరకు పట్టణాభివృద్ధి సంస్థల చైర్మన్, డైరెక్టర్ పదవులను రాజకీయ నాయకులతో భర్తీ చేసే వారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం మాత్రం అధికారులతో కమిటీని ఏర్పాటు చేయనుంది. ముడా పరిధి ఇలా..మున్సిపాలిటీలు

మెదక్, రామాయంపేట

రెవెన్యూ గ్రామాలు: 289

మండలాలు :17

# ధర పేలింది..!

కోదాడ :ఈ చిత్రంలో టపాసుల దుకాణాలు కనిపిస్తున్న ప్రాంతం కోదాడ పట్టణం. దుకాణాలు ఊరు చివరన ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నా.. పట్టణంలోని ఖాళీ స్థలంలోనే సుమారు 20 దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు కొనసాగిస్తున్నారు. రెండు దుకాణాల మధ్య కనీసం 3 మీటర్లు దూరం ఉండాలి. నిబంధనల ప్రకారం మంటలు చెలరేగితే ఆర్పేందుకు ఫైర్ ఇంజిన్ వాహనంతో పాటు, ఇసుక కూడా అందుబాటులో ఉండాలి. కానీ ఇక్కడ అలాంటి ఏర్పాట్లు ఏమీ చేయలేదు. దీపావళి అనగానే ఇంట్లో దీపాలు, ఇంటి ముందు బాణసంచా కాల్పులు గుర్తుకొస్తాయి. పండగకు రెండు రోజుల ముందు నుంచే చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు తమకు నచ్చిన టపాసులు పేలుస్తుంటారు. ఇక పండగ రోజైతే చెప్పనవసరం లేదు. దీన్నే అవకాశంగా టపాసుల దుకాణదారులు ధరలను అమాంతం పెంచేశారు. గతేడాదితో పోల్చుకుంటే కొన్ని టపాసుల ధరలు 50 శాతం పెంచగా, మరికొన్నింటి ధరలు 70 నుంచి నూరు శాతం వరకు అదనంగా పెంచారు. సిండికేట్ దందా..! దీపావళి పండగకు టపాసుల విక్రయాల మార్కెట్‌ను ఆసరా చేసుకొని జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు పెంచి విక్రయిస్తున్నారు. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, పురపాలక అధికారులు అధికారులు చూసీచూడనట్లు ఉండటంతో వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పిల్లలకు సంబంధించిన టపాసులు కొన్నా రూ.500 వరకు ఖర్చు వస్తుందని, ఈ స్థాయిలో ధరలు ఎప్పుడూ చూడలేదని, ధరల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు- సూర్యనారాయణ, ఆర్డీవో, కోదాడ దీపావళి పండగ సందర్భంగా టపాసుల ధరలు పెంచి విక్రయిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. అధిక లాభార్జనే ధ్యేయంగా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు కొనుగోలు చేసిన ధరల మీద 20 శాతంలోపే ధర పెంచి విక్రయించాలి.



# కడప స్టీల్ ప్లాంట్ కడతారా ? కట్టరా?

విజయవాడ : కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి చేసిన వ్యాఖ్యలు మరోసారి రాష్ట్ర ప్రజలను అవమానించినట్లే అని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి అన్నారు. ఎక్స్ వేదికగా షర్మిల స్పందిస్తూ.. అసలు ప్లాంట్ ప్రతిపాదనే తమ దగ్గర లేదని అపహాస్యం చేసినట్లు మాట్లాడటం నిజంగా సిగ్గుచేటన్నారు. ప్రతిపాదన వస్తే ఆలోచన చేస్తామని చెప్పడం ఏపీ రాష్ట్ర ప్రయోజనాలతో బీజేపీ చెలగాటం ఆడుతోందనడాని నిదర్శమన్నారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ఎంపీలు మౌనంగా ఉండటం వారి చేతకాని తనానికి అద్దం పడుతుందని విమర్శించారు. కడప ఉక్కు సీమ ప్రజల హక్కు అని.. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రమే %బాా×ూా% ఆధ్వర్యంలో నిర్మించి ఇచ్చేలా కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చిందని.. విభజన చట్టంలోనూ పెట్టిందన్నారు. అనంతరం అధికారంలోకొచ్చిన బీజేపీ సర్కార్ విభజన హామీలను కాల రాసిందని విమర్శించారు. సీమ ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని మండిపడ్డారు. కడప ప్రజలకు తీరని ద్రోహం చేసిందన్నారు. తిరుపతి వేదికగా కడప స్టీల్‌పై ప్రధాన మోదీ హామీ ఇచ్చారని.. ఆ తరువాత సాధ్యం కాదని, సొంత గనులు లేకుండా కష్టమని, లాభదాయకంగా లేదని సన్నాయి నొక్కులు నొక్కారని వ్యాఖ్యలు చేశారు. "ముఖ్యమంత్రి చంద్రబాబును సూటిగా ప్రశ్నిస్తున్నాం. కడప స్టీల్‌పై మీ వైఖరి ఏంటి? కేంద్ర ఉక్కుశాఖ మంత్రి ప్రకటనకు మీరిచ్చే సమాధానం ఏంటి ? అసలు కేంద్రం పరిశీలనలో లేదనడం మీరు సమర్ధిస్తారా ? కడప స్టీల్ ప్లాంట్ కడతారా ? కట్టరా? ఇప్పటికైనా స్టీల్ ప్లాంట్‌పై మీ ముసుగు తీయండి సార్. అనాడు బీజేపీ మోసం చేసిందని, కేంద్రం సహకరించక పోయినా.. రాష్ట్ర ప్రభుత్వమే ప్లాంట్ కడుతుందని ఒకసారి మీరు కొబ్బరి కాయ కొడితే... రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ భాగస్వామ్యం ఉండాలని మాజీ ముఖ్యమంత్రి జగన్ రెండు సార్లు టెంకాయలు కొట్టారు. నాలుగు సార్లు శంకుస్థాపన జరిగి ఒక్క అంగుళం కూడా ముందుకు కదలని ప్రాజెక్టు ప్రపంచంలో ఏదైనా ఉందంటే అది కడప స్టీల్ మాత్రమే" అని అన్నారు. "కేంద్రంలో బీజేపీ మూడో సారి అధికారంలో ఉందంటే మీ మద్ధతుతోనే. మీకు రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం అనుకుంటే, మోడీ ఇచ్చిన పదవులు ముఖ్యం కాకపోతే, విభజన హక్కు ప్రకారం కడప స్టీల్‌ను కేంద్రం నిర్మించి ఇచ్చేలా ప్రకటన చేయించండి. లేకుంటే భేషరతుగా రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పి బీజేపీకి ఇచ్చిన మద్దతు ఉపసంహరించుకోండి. కేంద్రం సహాయం లేకుండా రాష్ట్రమే నిర్మించే పనికి మోడీకి భజన చేయాల్సిన అవసరం ఉందా.. తేల్చుకోండి" అంటూ వైఎస్ షర్మిల ఎక్స్‌లో పోస్టు చేశారు.

# రాజ్యసభ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసిన కూటమి అభ్యర్థులు



అమరావతి: ఏపీలో మూడు రాజ్యసభ స్థానాలకు కూటమి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. తెదేపా తరపున బీద మస్తాన్ రావు, సానా సతీశ్.. భాజపా నుంచి ఆర్.కృష్ణయ్య నామినేషన్లు వేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. తమకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు చేస్తున్న కృషికి తాము కూడా తోడవుతామన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత ఐదేళ్లు దుర్మార్గ పాలన సాగిందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో ప్రస్తుతం వ్యవస్థలన్నింటినీ గాడిలో పెడుతున్నామని చెప్పారు. రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు మంగళవారమే చివరి రోజు. రాజ్యసభ సభ్యులుగా కృష్ణయ్య, మస్తాన్‌రావు, సతీశ్ ఎన్నిక లాంఛనమే.

# ఆ కారణంతోనే బీజేపీలోకి... ఆర్.కృష్ణయ్య



అమరావతి: రాజ్యసభ సభ్యత్వానికి నామినేషన్లు ప్రకియ పూర్తి అయింది. రాజ్యసభ అభ్యర్థులను బలపరిచేందుకు అసెంబ్లీకి ఎమ్మెల్యేలు చేరుకుంటున్నారు. మూడు రాజ్యసభ అభ్యర్థులకు మద్దతు తెలిపేందుకు అసెంబ్లీకి 40 మంది ఎమ్మెల్యేలు వస్తున్నారు. ఒక్కొక్క రాజ్యసభ సభ్యుడి నామినేషన్ కోసం పదిమంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం ఉంటుంది. అయితే నామినేషన్ వేసిన సందర్భంగా బీజేపీ రాజ్యసభ అభ్యర్థి ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ పిలిచి రాజ్యసభ ఇచ్చిందని తెలిపారు. బీసీల కోసమే పోరాటం చేస్తానని చెప్పారు. ఎక్కడ ఉన్నా ఎప్పుడు బీసీల సమస్యల కోసం పోరాటం చేశానని గుర్తుచేశారు. చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ కోసం పోరాటం చేస్తానని తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ పిలిచి తనకు రాజ్యసభ టికెట్ ఇచ్చిందని అన్నారు. సీఎం చంద్రబాబు తనను రాజకీయాల్లోకి పిలిచారని గుర్తుచేశారు. పార్లమెంట్‌లో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని చెప్పారు..50 ఏళ్లు బీసీల కోసం పోరాటం చేశానని చెప్పారు. వైసీపీకి పార్టీలో మాట్లాడే అవకాశం తక్కువ అని.. బీసీల గురించి ఎక్కువగా మాట్లాడే అవకాశం ఉంటుందని పార్టీ మారానని తెలిపారు. బీజేపీ తనకు కొత్త కాదని.. తాను కండువా కప్పుకున్న మొదటి పార్టీ బీజేపీ మాత్రమేనని అన్నారు. పార్టీల కండువాలు వేసుకోలేదు. అన్ని పార్టీలు బీసీల కోసం న్యాయం చేస్తున్నాయని చెప్పారు. పార్టీలే తన దగ్గరకు వచ్చాయని బీజేపీ అభ్యర్థి ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు.

**పోటీకి దూరంగా వైసీపీ...** రాష్ట్రం నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు కూటమి అభ్యర్థులు ఖరారయ్యారు. టీడీపీ నుంచి బీద మస్తాన్ రావు, సానా సతీశ్... బీజేపీ అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్యను రాజ్యసభకు ఎంపిక చేశారు. ముగ్గురు అభ్యర్థులు మంగళవారం నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీకి తగిన సంఖ్యాబలం లేకపోవడంతో పోటీకి దూరంగా ఉంది. ఈ నేపథ్యంలో కూటమి అభ్యర్థుల ఎంపిక ఏకగ్రీవం కానుంది. కాగా తెలంగాణకు చెందిన బీసీ నాయకుడు ఆర్.కృష్ణయ్య... గతంలో వైసీపీ తరపున రాజ్యసభలో అడుగుపెట్టారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే తన సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయనను బీజేపీ తిరిగి రాజ్యసభకు పంపనున్నట్లు 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. కృష్ణయ్య సోమవారం ఆన్‌లైన్ ద్వారా బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. అటు రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను, పార్టీ సభ్యత్వాన్ని కృష్ణయ్య ఒకేసారి తీసుకున్నారు.

**కొంతకాలం టీడీపీలో ఎంతో బాధించింది: బీదా మస్తాన్ రావు..** రాష్ట్రాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థి బీదా మస్తాన్ రావు తెలిపారు. అనివార్య కారణాల వల్ల రెండున్నరేళ్లు తెలుగుదేశానికి దూరమయ్యానని అన్నారు. సొంతిల్లు లాంటి తెలుగుదేశంలో కొంతకాలం లేకపోవడం ఎంతో బాధించిందని చెప్పారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు కీలక పదవులు ఆపార్టీలో దక్కుతున్నాయని బీదా మస్తాన్ రావు తెలిపారు.

**బాధ్యతతో నిర్వర్తిస్తా: సానా సతీష్...** చిన్న వయస్సులోనే నాకు కీలక పదవి ఇచ్చి ప్రోత్సహించినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లకు రాజ్యసభ అభ్యర్థి సానా సతీష్ ధన్యవాదాలు తెలిపారు. వచ్చిన అవకాశాన్ని బాధ్యతతో నిర్వర్తిస్తానని సానా సతీష్ చెప్పారు.

**సమర్థులకు కీలక పదవులు:జీవీ ఆంజనేయులు...** పార్టీలో సమర్థుల్ని గుర్తించి అధినేత వారికి కీలక పదవులు ఇచ్చారని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు.

రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుతూ మిత్ర పక్షాల ఐక్యతను ముందుకు తీసుకెళ్తామని జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు.

# పవన్ కళ్యాణ్‌కు బెదిరింపు కాల్స్ కేసులో పురోగతి




అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేషీకి బెదిరింపు కాల్స్ రావడం కలకలం రేపింది. పవన్‌ను చంపేస్తామని హెచ్చరిస్తూ గుర్తు తెలియని వ్యక్తి నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్, అభ్యంతరకర భాషతో సందేశాలు రావడంతో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. రంగంలోకి దిగిన పోలీసులు పురోగతి సాధించారు. ఫోన్ కాల్స్ ఆధారంగా నిందితుడిని గుర్తించారు. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు నూక మల్లికార్జున్ అని, మానసిక స్థితి సరిగ్గా లేదని, మద్యం మత్తులో బెదిరింపు కాల్స్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అదుపులోకి తీసుకున్న నిందితుడిని విజయవాడ పోలీసులు విచారిస్తున్నారు. గతంలో వైజాగ్‌లో నూక మల్లికార్జున్‌పై 354 కేసు నమోదైంది. కాగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేషీకి బెదిరింపు కాల్స్ రావడం కలకలం రేపింది. పవన్ కళ్యాణ్‌ను చంపేస్తామని హెచ్చరిస్తూ ఓ ఆగంతకుడు ఫోన్ చేసి బెదిరింపులకు దిగాడు. పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశిస్తూ అభ్యంతకర భాషలో హెచ్చరిస్తూ మెసేజ్‌లు పంపించాడు దుండగుడు. దీంతో పేషీ సిబ్బంది బెదిరింపు కాల్స్, మెసేజ్‌ల గురించి ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

బెదిరింపు కాల్స్ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెంటనే తెలియజేశారు. ఘటనపై రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఫోన్ కాల్స్, మెసేజ్‌లు పెట్టిన నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

**హోంమంత్రి ఆరా..** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు బెదిరింపు ఫోన్ కాల్స్‌పై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ఆరా తీశారు. మెసేజ్‌లు , ఫోన్ కాల్స్ వివరాలను ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే ఘటనపై చర్యలు తీసుకోవాలని, నిందితులను వెంటనే అరెస్టు చేయాలంటూ హోంమంత్రి ఆదేశాలు జారీ చేశారు. దీని వెనక ఎవరు ఉన్నా వదిలిపెట్టేది లేదని ఆమె హెచ్చరికలు జారీ చేశారు. హోంమంత్రి ఆదేశాల మేరకు ఫోన్ కాల్స్ ఎక్కడి నుంచి వచ్చాయనే దానిపై సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి సారించారు.

**వారి పనేనా...** ఇటీవలే రేషన్ మాఫియాపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఉక్కుపాదం మోపారు. పవన్ స్వయంగా కాకినాడ పోర్టుకు వెళ్లి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. సముద్రం లోపలికి వెళ్లిన ఓడలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యాన్ని పవన్ పట్టుకుని కేసులు నమోదు చేయించారు. ఈ సంఘటన తర్వాతే ఆయన పేషీకి బెదిరింపు కాల్స్ వచ్చాయి. ఈ బెదిరింపుల వ్యవహారంలో రేషన్ అక్రమ రవాణా మాఫియా హస్తం ఏమైనా ఉందా? అనే కోణంలోనూ పోలీసులు విచారణ చేశారు.



# కేజ్రీవాల్ 'అద్దాల మేడ'

దిల్లీ: మరికొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న దేశ రాజధాని దిల్లీలో 'సీఎం బంగ్లా' వివాదం రాజకీయ దుమారం రేపుతోంది. తనను తాను సామాన్యుడిగా చెప్పే మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్.. అధికారంలో ఉన్న సమయంలో రూ.కోట్లు ఖర్చుపెట్టి ముఖ్యమంత్రి నివాసానికి మార్పులు చేశారని భాజపా కొంతకాలంగా ఆరోపిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అందుకు సంబంధించి ఓ వీడియో విడుదల చేయడం తాజా వివాదం రాజుకుంది. ప్రజాధనం ఉపయోగించి కేజ్రీవాల్ ఇంద్రభవనాన్ని నిర్మించుకున్నారని భాజపా మండిపడింది. దీన్ని ఆప్ తీవ్రంగా ఖండించింది. అసలేం జరిగిందంటే..? భాజపా దిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ తన 'ఎక్స్' ఖాతాలో ఓ వీడియో పోస్ట్ చేశారు. దిల్లీలోని 6 ఫ్లాగ్ స్టాఫ్ రోడ్‌లో ఉన్న దిల్లీ సీఎం బంగ్లా వీడియో అది. దీన్ని గతంలో అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా ఉన్న సమయంలో అధికారిక నివాసంగా వినియోగించారు. ఈ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ)'గా అభివర్ణించిన భాజపా నేత.. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ఆయన 7-స్టార్ రిసార్ట్ నిర్మించుకున్నారని మండిపడ్డారు. ఆ బంగ్లాలో మార్బుల్ గ్రానైట్ లైటింగ్ కోసం రూ.1.9కోట్లు, ఇతరత్రా సివిల్ వర్క్ కోసం రూ.1.5కోట్లు, జిమ్, స్పా వంటి వాటి కోసం రూ.35లక్షలు.. ఇలా మొత్తంగా రూ.3.75కోట్లు ఖర్చు చేసి ఈ భవనాన్ని లగ్జరీగా మార్చుకున్నారని ఆరోపించారు. "కామన్ మ్యాన్ అని చెప్పే కేజ్రీవాల్.. తన పిల్లలపై ప్రమాణం చేసి అబద్ధాలు చెప్పారు. ప్రభుత్వ నివాసం, కారు ఏవీ తీసుకోలేదన్నారు. కానీ, దిల్లీ ప్రజల సొమ్మును ఇలా దోచుకున్నారు" అని భాజపా నేత దుయ్యబట్టారు. ఈ వీడియోపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా స్పందించింది. భాజపా నిరాధార ఆరోపణలు చేస్తోందని, అసలైన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లిస్తోందని ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోదియా మండిపడ్డారు. "విద్య, ఆరోగ్య సంస్కరణల గురించి ప్రజలు అడుగుతుంటే.. వారు మాత్రం బంగ్లాల గురించి మాట్లాడుతున్నారు" అని ఎద్దేవా చేశారు. కేజ్రీవాల్ అధికారంలో ఉన్న సమయంలో సీఎం నివాసంలో మరమ్మతుల కోసం రూ.కోట్లు ఖర్చుపెట్టారంటూ భాజపా కొద్ది నెలల క్రితం ఆరోపించింది. దీనిపై ఈ ఏడాది సెప్టెంబరులో సీబీఐ దర్యాప్తు చేపట్టింది. బంగ్లా నిర్మాణం సమయంలో టెండర్ నిబంధనల ఉల్లంఘన జరిగిందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఇప్పటివరకు దీనిపై రెగ్యులర్ కేసును నమోదు చేయలేదు.

# చెత్త పన్ను తప్పు.. చెత్త నిర్వహణ ఎలా చేయాలో గత ప్రభుత్వానికి తెలియదు: మంత్రి నారాయణ



పల్నాడు: పల్నాడు జిల్లాలోని జిందాల్ ప్రాజెక్టును మంత్రి నారాయణ పరిశీలించారు. ప్లాంట్ నిర్వహణ, ఇతర వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పన వంద శాతం పూర్తి చేస్తామని చెప్పారు. "2014-19 మధ్య చాలా అధ్యయనం తర్వాత ప్లాంట్ నిర్ధయించాం. వైకాపా ప్రభుత్వం విద్యుదుత్పత్తి ప్లాంట్‌లను వదిలేసింది. 7 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ నుంచి చెత్తను ప్లాంట్‌కు తరలిస్తున్నారు. 6890 మెట్రిక్ టన్నుల చెత్తలో 2,500 టన్నులను విద్యుత్‌గా మారుస్తున్నారు. కాకినాడ, నెల్లూరులో త్వరలో ప్లాంట్ ఏర్పాటు చేస్తాం. గత ప్రభుత్వం ఒక్క ప్లాంట్ కూడా ఏర్పాటు చేయలేదు. చెత్త పన్ను తప్పు.. చెత్తను ఎలా నిర్వహించాలో గత ప్రభుత్వానికి తెలియదు. చట్ట సవరణ చేసి మరీ చెత్త పన్ను తొలగించాం" అని మంత్రి అన్నారు. 16 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ నిర్మించినట్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. వ్యర్థాల నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్‌తో ప్రజలకు ఎంతో మేలని పేర్కొన్నారు. ప్లాంట్ ఏర్పాటులో చంద్రబాబు, నారాయణ కృషి ఎంతో ఉందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి అన్నారు. విదేశీ సాంకేతికతను పరిశీలించాకే నారాయణ ఈ ప్లాంట్ నిర్మాణం చేయించారని చెప్పారు



# రెండో రోజు పోలీసు విచారణకు హాజరైన అవినాష్ పీఏ రాఘవరెడ్డి

కడప: వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి రెండో రోజు పోలీసు విచారణకు హాజరయ్యాడు. కడప సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో విచారణ జరుగుతోంది. సోమవారం 11 గంటల పాటు రాఘవరెడ్డిని పులివెందుల డీఎస్పీ ప్రశ్నించారు. వర్రా రవీందర్ రెడ్డి చేత అసభ్యకరమైన పోస్టులు పెట్టించారని రాఘవరెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. విచారణ నేపథ్యంలో పోలీస్ స్టేషన్ వద్దకు పులివెందుల నుంచి వైకాపా కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.

# రాంగోపాల్ వర్మకు ముందస్తు బెయిల్




అమరావతి, డిసెంబర్ 10: వివాదాస్పద దర్శకుడు రాంగోపాల్ వర్మకు ముందస్తు బెయిల్ లభించింది. సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , మంత్రి లోకేష్‌పై అసభ్యకర, అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అలాగే దర్యాప్తుకు సహకరించాలని రామ్ గోపాల్ వర్మకు న్యాయస్థానం ఆదేశించింది. పోలీసులు కోరినప్పుడు విచారణకు హాజరుకావాలని వర్మకు హైకోర్ట్ స్పష్టం చేసింది. కాగా.. వర్మ రూపొందించిన 'వ్యూహం' సినిమా ప్రమోషన్‌లో భాగంగా అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు, నారా లోకేశ్, బ్రాహ్మణి, పవన్ కళ్యాణ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ వ్యవహారంపై మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో వర్మపై ఫిర్యాదు నమోదైంది. మార్ఫింగ్ చేసిన ఫొటోలు ఎక్స్ లో పోస్టు చేశాడని టీడీపీ మండల కార్యదర్శి రామలింగం మద్దిపాడు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 10న ఏడు సెక్షన్లతో రాంగోపాల్ వర్మపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా తనపై నమోదైన కేసు కొట్టేయాలని వర్మ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం ఆ పిటిషన్‌ను తిరస్కరించింది. ఈ క్రమంలో రాంగోపాల్ వర్మని విచారించేందుకు పోలీసులు ఒంగోలు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి విచారణకు రావాల్సిందిగా ఆర్జీవీకి నోటీసులు జారీ చేశారు. అయితే రెండు సార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ వర్మ పోలీసుల విచారణకు గైర్హాజరయ్యారు. తొలుత నవంబర్ 19న విచారణకు రావాల్సిందిగా వర్మకు పోలీసులు నోటీసులు ఇవ్వగా.. తాను షూటింగ్‌లో బిజీగా ఉన్నాని వారం రోజులు సమయం ఇవ్వాలని కోరగా.. అందుకు పోలీసులు అంగీకరించారు. తిరిగి వారం రోజుల తర్వాత మరోసారి వర్మకు నవంబర్ 25న విచారణకు రావాల్సిందిగా నోటీసులు ఇచ్చారు. రెండో సారి కూడా విచారణకు వర్మ దుమ్మా కొట్టాడు. దీంతో ఆయనను అరెస్ట్ చేసేందుకు వర్మ నివాసానికి వెళ్లిన పోలీసులు.. అక్కడ ఆయన లేకపోవడంతో వెనుదిరిగారు. అయితే పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్న వర్మ సోషల్ మీడియాలో మాత్రం తెగ యాక్టివ్‌గా ఉంటూ వస్తున్నారు. అలాగే పలు ఛానల్‌కు కూడా ఇంటర్వ్యూలు ఇచ్చారు. తాను పరారీలో లేనని.. అసలు పోలీసులు తన ఆఫీసుకే రాలేదంటూ చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో ఈ కేసుకు సంబంధించి హైకోర్టును ఆశ్రయించగా.. వర్మకు ఊరట లభించింది. రాంగోపాల్ వర్మకు ముందస్తు బెయిల్‌ను మంజూరు చేస్తూ తప్పకుండా విచారణకు హాజరుకావాలని ఆర్జీవీకి హైకోర్టు సూచించింది.

# విజయసాయిని జైలుకు పంపడానికి ఆ ఒక్క అసత్య ఆరోపణ చాలు: సోమిరెడ్డి



అమరావతి: వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి మితిమీరిన మాటలను పోలీసులు ఉపేక్షించాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆయన ఇంకా బయట తిరుగుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. అమరావతిలో మీడియాతో ఆయన మాట్లాడారు.

విజయసాయిరెడ్డిని జైలుకు పంపడానికి పింక్ డైమండ్‌పై చేసిన అసత్య ఆరోపణ ఒక్కటి చాలన్నారు. దోపిడీకి కాదేదీ అనర్హం అన్నట్లు జగన్‌తో అవినీతిలో ఆయన పోటీ పడ్డారని విమర్శించారు.

# పవన్‌కు ఉండవల్లి సంచలన లేఖ




రాజమండ్రి: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు రాజమండ్రి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ లేఖ రాశారు. మీ శ్రేయోభిలాషి అంటూ లేఖలో సంబోధించారు. ఏపీకి జరిగిన అన్యాయాన్ని పార్లమెంట్‌లో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు పలుమార్లు ప్రస్తావించారని అన్నారు. ఏపీకి జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటాలనేదే తన వాదన అని తెలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలోనూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు బీజేపీతో కలిసి పనిచేయటం వల్ల రాష్ట్రానికి రావాల్సినవి రాబట్టుకోవటానికి, జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుకోవటానికి ఇదే సరైన సమయమని అన్నారు. పార్లమెంట్ ఉభయ సభల్లోనూ విభజన జరిగిన తీరు, ఏపీకి జరిగిన అన్యాయంపై చర్చకు నోటీసులు ఇప్పించాలన్నారు. సుప్రీంకోర్టులో చాలాకాలంగా పెండింగ్‌లో పడిపోయిన రాష్ట్ర విభజన అంశాన్ని త్వరితగతిన ఒక కొలిక్కి తీసుకురావాలని ఉండవల్లి అరుణ్ కుమార్ కోరారు.




# చీర కట్టులో నా సామిరంగ..!

కన్నడ ముద్దుగుమ్మ ఆషికా రంగనాథ్ క్రేజీ బాయ్ సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయ్యింది. కన్నడ సినిమాల్లో ఎక్కువగా నటించిన ఈ అమ్మడు తమిళ్‌లో మొదటి సారి పట్టతు ఆసరన్‌లో నటించింది. 2022లో వచ్చిన ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. కన్నడంలో దక్కిన స్టార్‌డం నేపథ్యంలో తమిళ్, తెలుగు సినిమా ఇండస్ట్రీల్లో ఆఫర్లు వచ్చాయి. తెలుగులో ఈ అమ్మడు ఎంట్రీ ఇచ్చిన సమయంలో మంచి హీరోయిన్‌గా పేరు దక్కించుకుంటుందని, వరుసగా ఆఫర్లు సొంతం చేసుకుంటుంది అంటూ అంతా భావించారు. తెలుగులో ఈఅమ్మడు నటించిన నాగార్జున 'నా సామిరంగ' సినిమా బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్ అయ్యింది. అందుకే ఈ అమ్మడు మళ్లీ టాలీవుడ్‌లో కనిపించడం లేదు. కొన్ని సినిమా ఆఫర్లు వచ్చినా చిన్నా చితకా అనే ఉద్దేశ్యంతో తిరస్కరించిందని సమాచారం అందుతోంది. స్టార్ హీరో సినిమాలో ఛాన్స్ కోసం ఆషికా



ఎదురు చూస్తుంది. ప్రస్తుతం ఇతర భాషల్లో రెగ్యులర్‌గా సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలతో పిచ్చెక్కిస్తోంది. ఇటీవల ఈ అమ్మడు షేర్ చేసిన సముద్రంపై షికారు ఫోటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. ఇప్పుడు చీర కట్టులో ఈ అమ్మడి యొక్క ఫోటో షూట్ చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఈ స్థాయి అందం ఆషికాకే సాధ్యం అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు తెర తీసే విధంగా ఈ అమ్మడి యొక్క చీర కట్టు ఫోటోలు ఉన్నాయి.

చీర కట్టులో నడుము నాభి అందం చూపిస్తే ఆ ఫోటోలు వైరల్ అవుతాయి. కానీ ఆషికా నడుము కనిపించకుండానే, నాభి చూపించకుండానే వైరల్ అవుతోంది. కలర్‌ఫుల్ చీర కట్టుతో ఈ అమ్మడు ఓ రేంజ్‌లో ఆకట్టుకుంది. అన్ని వర్గాల వారిని మెప్పించే విధంగా ఈమె అందంగా ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉన్నారు. తెలుగులో మొదటి సినిమా నిరాశ పరచడంతో కనిపించకుండా పోయిన ఆషికా రంగనాథ్‌ను ప్రేక్షకులు మళ్లీ చూడాలని కోరుకుంటున్నారు. ముఖ్యంగా తెలుగులో ఈమెకు యంగ్ స్టార్ హీరోల సరసన ఆఫర్లు వస్తే చూడాలని, ఆమె ప్రతిభ, అందం ఆ సినిమాల్లో చూడాలని ఆశ పడుతున్న వారు చాలా మంది ఉన్నారు. ప్రస్తుతానికి కన్నడం, తమిళ్ సినిమాల్లో మాత్రమే నటిస్తున్న ఈ అమ్మడు ముందు ముందు మరిన్ని సినిమాలు చేస్తుందేమో చూడాలి.

# ఇకపై నో అంటే నో!

పుష్ప 2 లో ఐటెం సాంగ్‌ను బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌తో చేయించాలని దర్శకుడు సుకుమార్ అనుకున్నాడు. అల్లు అర్జున్ సైతం బాలీవుడ్ హీరోయిన్ అయితేనే బాగుంటుంది అనుకున్నాడు. అందుకే పలువురు హీరోయిన్స్‌ను పరిశీలించిన తర్వాత సాహో సినిమాలో హీరోయిన్‌గా నటించి తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలు అయిన శ్రద్ధా కపూర్‌ను అనుకున్నారు. ఆమెను సంప్రదించగా ఓకే చెప్పింది. అయితే పారితోషికం విషయంలో ఇబ్బంది ఎదురైందట. సినిమాకు ఉన్న క్రేజ్ నేపథ్యంలో ఆమె పుష్ప 2 ఐటెం సాంగ్ కోసం ఏకంగా రూ. 8 కోట్లు డిమాండ్ చేసిందట. దాంతో నిర్మాతలు అమ్మ బాబోయ్ మా వల్ల కాదు అంటూ ఆమెతో చర్చలు ఆపేశారు. సుకుమార్‌కి సైతం అంత పారితోషికం ఇచ్చి శ్రద్ధ కపూర్‌తో ఆ పాట చేయించాలని లేదట. అందుకే అల్లు అర్జున్ సూచనతో శ్రీలీలను ఎంపిక చేసి ఉంటారు అనే టాక్ వినిపిస్తోంది. సాధారణంగా శ్రీలీల ఐటెం సాంగ్స్ చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఆ మధ్య ఒక స్టార్ హీరో సినిమాలో ఐటెం సాంగ్‌కి నో చెప్పింది. అంతే కాకుండా చిరంజీవి సినిమా విశ్వంభరలోనూ శ్రీలీల ప్రత్యేక పాటలో నటించేందుకు



సంప్రదిస్తే నో చెప్పిందట. అందుకే పుష్ప 2 లో ఆమె నటించేందుకు ఒప్పుకుంటుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. పుష్ప 2 సినిమాలో ఐటెం సాంగ్ ఆఫర్ చేయడంతో పాటు, వారం రోజుల లోపు డేట్లు ఇస్తేనే భారీ పారితోషికం అంటూ మైత్రి వారు ఆఫర్ ఇచ్చారు. అల్లు అర్జున్‌తో డాన్స్ చేయాలనే కోరిక శ్రీలీలకు చాలా కాలంగా ఉంది. ఆయనతో సినిమాలో నటించే అవకాశం వస్తుందో లేదో అందుకే కిస్సిక్ సాంగ్ లో చేసేద్దాం అని శ్రీలీల భావించిందట. అందుకే శ్రీలీల కిస్సిక్ సాంగ్‌లో నటించి మెప్పించింది. పుష్ప 2 లో ఐటెం సాంగ్ చేయాలని ఆమెను అడిగిన వెంటనే ఆలోచించకుండా అల్లు అర్జున్ కోసం, ఆయనతో డాన్స్ చేయడం కోసం, పుష్ప కి ఉన్న క్రేజ్ నేపథ్యంలో ఓకే చెప్పిందట. ఇకపై శ్రీలీల ఐటెం సాంగ్స్‌కి నో చెప్పదట. ఈ విషయాన్ని ఆమె స్వయంగా చెప్పుకొచ్చింది. అల్లు అర్జున్ కోసం కిస్సిక్ చేశాను తప్ప ప్రత్యేకంగా తాను ఐటెం సాంగ్ చేయాలని అనుకోలేదు. ఇకపై ఎవరైనా తనను ఐటెం సాంగ్ కోసం సంప్రదిస్తే కచ్చితంగా నో అని చెబుతాను అంది. నో అంటే నో అని చెబుతాను అంటూ గట్టిగా చెప్పిన శ్రీలీల ప్రస్తుతం నితిన్‌తో కలిసి రాబిన్ హుడ్ సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. ఆ సినిమా షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. ఆ సినిమాపై శ్రీలీల చాలా ఆశలు పెట్టుకుంది. మరి ఫలితం ఎలా ఉంటుందో చూడాలి.

# ప్రభాస్ పంపిన క్యారేజీ తిన్నాక జగ్గూభాయ్ ఫీలింగ్!





ప్రభాస్ అందరికీ డార్లింగ్. అభిమానులు, పరిశ్రమ వ్యక్తులు డార్లింగ్ అని ప్రేమగా పిలుస్తారు. ప్రభాస్ అంటే స్నేహం, సహాయం, రుచికరమైన ఆహారం ఇంకా ఎన్నో గొప్ప లక్షణాల కలయిక అని సన్నిహితులు చెబుతూనే ఉంటారు. ఆయన విందుకు పిలిస్తే క్యాటరింగ్ భారీగా ఉంటుందని శుచిగా భోజనం చేసిన ప్రతి ఒక్కరూ చెబుతారు. ప్రభాస్‌తో కలిసి పనిచేసే ప్రతి ఒక్కరూ .. సన్నిహిత మిత్రులు, అతడి సహనటులు, కథానాయికలు అతడు వడ్డించే రుచికరమైన వంటకాలు అందులో వెరైటీల గురించి మాట్లాడుకుంటారు. అతడిని కలిసేందుకు ఎవరు వెళ్లినా కడుపు నిండా భోజనం చేసి రావాలనేది నియమం. అంతేకాదు.. ప్రభాస్ వీలున్న ప్రతిసారీ తన బంధుమిత్రులకు రుచికరమైన ఆహారం నింపిన క్యారేజీని పంపుతుంటాడు. అలాంటి ఒక క్యారేజీ జగ్గూ భాయ్ అలియాస్ జగపతిబాబుకు అందింది. ఆయన దానిని ఫ్లూటుగా తిని హాయిగా నిదురించానని చెబుతున్నారు. జగపతి బాబు కోసం డార్లింగ్ పంపించిన యమ్మీ యమ్మీ ఫుడ్ ఇప్పుడు అందరి నోళ్లు ఊరిస్తోంది.

ప్రస్తుతం దేవా షూటింగ్‌కి వచ్చాను. నా కోసం ప్రభాస్ పంపిన వంటకాలు చూశారా? అని జగపతి బాబు ఓ వీడియో చేసి చూపించాడు. ప్రభాస్ పంపిన భోజనం క్యారేజీ వెరైటీలు చూస్తే ఎవరైనా షాక్ అవుతారు. వెజ్ – నాన్ వెజ్‌లో చాలా రకాల ఐటమ్స్ ఇందులో ఉన్నాయి. వివాహ భోజనంబు.. వింతైన వంటకంబు.. అంటూ జగపతిబాబు మాయాబజార్ పాటతో కూడిన వీడియోను షేర్ చేసి ఆనందాన్ని పంచుకున్నాడు. తాను బకాసురుడిలా తిన్నానని, కుంభకర్ణుడిలా నిద్రపోయానని జగపతి బాబు అన్నారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ గా మారుతోంది. అయితే ఇది పాత వీడియో.. కానీ జగ్గూభాయ్ ఇప్పుడు షేర్ చేశారు. ప్రస్తుతం నటుడు జగపతి బాబు పోస్ట్‌పై ప్రభాస్ అభిమానులు కామెంట్లతో విరుచుకుపడుతున్నారు. ఇంత తిండి ఒక్కడివే తిన్నావా? అని ఒకరు.. ఇంత తిండి ఒక్కడికేనా? ఇదేంటి ప్రభాస్? అని మరికొందరు ప్రశ్నించారు. కొందరు సలార్-2 అప్ డేట్ అడిగారు. సలార్ సినిమాలో కింగ్ మన్నార్ పాత్రలో జగపతిబాబు నటించిన సంగతి తెలిసిందే. భీమవరం రాజులకు ప్రభాస్ ఒక ల్యాండ్ మార్క్. పుట్టింది చెన్నైలో అయినప్పటికీ ప్రభాస్ తల్లిదండ్రులు భీమవరానికి చెందినవారు. అందుకే తన ఊరికి తన బంధువులెవరైనా వచ్చారని తెలిసినా ప్రభాస్ కూడా ఇలాగే భోజనం ఏర్పాటు చేస్తాడు. ఒక లంచ్ క్యారియర్ వారి స్థలానికి వెళుతుంది. ఇంతకుముందు నటుడు కృష్ణంరాజు సంస్మరణ సందర్భంగా వేలాది మంది అభిమానులకు ప్రభాస్ భోజన ఏర్పాట్లు చేశారు. వారు తమ అభిమానులకు రాజుల భోజనం పెట్టారు. రకరకాల వెజ్ నాన్ వెజ్ వంటకాలను వడ్డించారు. ప్రభాస్‌కు ఆహారమంటే ఇష్టమే కాదు. వ్యక్తిగతంగా ప్రభాస్ తన అభిరుచిని విందులో కూడా ప్రదర్శిస్తారు. ప్రభాస్ ప్రస్తుతం ది రాజా సాబ్, ఫౌజీ చిత్రాల్లో నటిస్తున్నారు. సలార్-2 చిత్రీకరణ కూడా ప్రారంభిస్తారు. హోంబలే ఫిల్మ్స్‌తో ప్రభాస్ మూడు సినిమాలకు ఒప్పందం కుదుర్చుకున్నారని ప్రచారం ఉంది. రిషబ్ శెట్టి ఒక సినిమాకి కథ రాయనున్నాడని కూడా కథనాలొస్తున్నాయి.

# టికెటింగ్ పోర్టల్ లో సంక్రాంతి జోరు మామూలుగా లేదే!




విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో 'సంక్రాంతి వస్తున్నాం' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇద్దరి కాంబినేషన్ లో వస్తోన్న మూడవ చిత్రం ఇది. అనీల్ సోలో హీరోగా వెంకీని ఎలా ఆవిష్కరించాడు? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, మేకింగ్ వీడియో పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేశాయి.

అధికారికంగా రిలీజ్ తేదీని ప్రకటించారు. సరిగ్గా సంక్రాంతి పండుగ రోజునే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. వెంకటేష్ సినిమాలంటే ఫ్యామిలీ ఆడియన్స్ లో మంచి క్రేజ్ ఉన్న చిత్రాలు. అలాం టి వెంకీకి అనీల్ తోడవ్వ డంతో ఈసారి అంచనాలు పీక్స్ కి చేరుతున్నాయి. వెంకీ...అనీల్ మార్క్ చిత్రమని ప్రూవ్ అవుతుంది. తాజాగా ఈ సినిమాకి క్రేజ్ ఎలా ఉందన్నది మరోసారి ప్రూవ్ అయింది. బుక్ మై షో టికెటింగ్ పోర్టల్ లో లక్షకు పైగా ఆసక్తిని చూపించారు. ఐయామ్ ఇంట్రెస్టెడ్ అంటూ ప్రేక్షకులు సినిమాపై తమ ఆసక్తిని వెల్లడించారు. దీంతో ఈ సినిమా కోసం ప్రేక్షకా భిమానులు ఎంతో ఎగ్జైట్ మెంట్ తో ఎదురు చూస్తున్నట్లు స్పష్టమైంది. సంక్రాంతి సీజన్ రిలీజ్ లో ఈ సినిమా మంచి ఫలితాలు సాధిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. సేఫ్ జోన్ చిత్రం గానూ సంక్రాంతికి వస్తున్నాం పేరు సినీ మార్కెట్ లో బలంగా వినిపిస్తుంది. ఈ సినిమాలోని 'గోదారి గట్టు' అనే చార్ట్‌బస్టర్ పాటతో మ్యూజికల్ ప్రమోషన్‌లు ప్రారంభమైంది. అప్పటి నుంచి ఒక్కో లిరికల్ శ్రోతల్ని అలరించింది. తాజాగా అడ్వాన్స్ బుకింగ్ కోసం లక్షలాది మంది ఎదురు చూస్తోన్న విషయం స్పష్టమైంది. గంటల వ్యవధిలోనే మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రంలో ఐశ్వర్య రాజేష్ – మీనాక్షి చౌదరి కూడా కథానాయికలుగా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వరా క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్నారు. ఇదే సీజన్ కు ఆయన నిర్మిస్తోన్న మరో చిత్రం గేమ్ ఛేంజర్ కూడా జనవరి 10న రిలీజ్ అవుతుంది. ఈ రెండు రిలీజ్ లకు నాలుగు రోజులు గ్యాప్ ఉంది.

# నా ఫిజిక్ ఫిట్‌కి రహస్యం ఇదే..!

తెలుగు ప్రేక్షకులకు ఇచ్చట వాహనములు నిలుపరాదు సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి మెల్లమెల్లగా టాలీవుడ్‌లోనే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో స్టార్ హీరోయిన్‌గా మంచి గుర్తింపు దక్కించుకుని దూసుకు పోతుంది. ముఖ్యంగా టాలీవుడ్‌లో ఇటీవల బ్యాక్ టు బ్యాక్ లక్కీ భాస్కర్, మట్కా, మెకానిక్ రాకీ సినిమాల్లో నటించి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ ఏడాదిలో ఈమె నటించిన ఆరు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. అందులో లక్కీ భాస్కర్ భారీ విజయాన్ని సొంతం చేసుకోగా ఇతర సినిమాల్లో కొన్ని పర్వాలేదు అనిపిస్తే కొన్ని సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. ఈ ఏడాదిలో వరుసగా ఆరు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ అమ్మడు వచ్చే ఏడాదిలోనూ బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసేందుకు కమిట్ అయ్యింది. సన్నగా నాజూకుగా ఉండే ఈ అమ్మడు చాలా అందంగా కనిపిస్తూ ఉంటుంది. మోడలింగ్ ద్వారా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈ అమ్మడి ఫిట్‌నెస్ గురించి, ఫిజిక్ గురించి అంతా మాట్లాడుకుంటూ ఉంటారు. సోషల్ మీడియాలో ఈమెకి ఉన్న ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అందుకు కారణం ఆమె అందం అనడంలో సందేహం లేదు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ తన యొక్క అందం, ముఖ్యంగా ఫిజికల్ ఫిట్‌నెస్‌కి సంబంధించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఒక ఇంటర్వ్యూలో ఆమె



మాట్లాడుతూ... ఎక్కువ శాతం మంది నా ఫిట్‌నెస్ గురించి మాట్లాడుతూ ఉంటారు. నా ఫిట్‌నెస్‌కి నూరు శాతం నా తండ్రి కారణం. ఆయన చిన్నప్పటి నుంచి నన్ను ఆటల్లో ప్రోత్సహించారు. నా వెంట ఉండి స్పోర్ట్స్ లో ట్రైనింగ్ ఇప్పించారు. అందుకే నేను స్విమ్మింగ్, బ్యాడ్మింటన్‌లో స్టేట్ లెవల్ ప్లేయర్‌గా చాలా మ్యాచ్‌ల్లో ఆడాను అంది. ఒక స్పోర్ట్స్ పర్సన్‌ని కనుక సహజంగానే నేను ఫిట్‌గా ఉండేందుకు వర్కౌట్లు ఎక్కువ చేసే దాన్ని, ఇప్పుడు కూడా అదే అలవాటుతో రెగ్యులర్‌గా తాను ఫిట్‌నెస్ కోసం తాను ఎక్కువగా వర్కౌట్‌లు చేస్తూ ఉంటాను అంది. అందుకే తాను ఇంత ఫిట్‌గా ఉన్నాను అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ అమ్మడు సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. వెంకటేష్ హీరోగా రూపొందుతున్న ఆ సినిమాలో మీనాక్షి చౌదరి కీలక పాత్రలో కనిపించబోతున్నారు. సంక్రాంతి నుంచి ఈ అమ్మడి సందడి మొదలు పెట్టబోతుంది. వచ్చే ఏడాదిలో ఈ ఏడాది కంటే ఎక్కువ సినిమాలను చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

# సమంత రూత్ ప్రభు తక్షణ కర్తవ్యం?

అమెరికన్ వెబ్ సిరీస్ లలో శృంగారం, యాక్షన్ కంటెంట్ పాళ్లు చాలా ఎక్కువ. సిటాడెల్ వెబ్ సిరీస్ లో పెచ్చుమీరిన యాక్షన్, శృంగారం గురించి చాలా చర్చ సాగింది. ప్రియాంక చోప్రా పెళ్లి తరవాత కూడా ఎలాంటి భేషజం లేకుండా కోస్టార్స్ తో రొమాంటిక్ సన్నివేశాల్లో జీవించింది. అయితే భారతీయ వెర్షన్ విషయంలో శృంగారం పాళ్లను బ్యాలెన్స్ చేసారు రాజ్ అండ్ డీకే. యాక్షన్ కంటెంట్ కి ఇక్కడ ప్రాధాన్యతను పెంచారు. సిటాడెల్ -హనీ బన్నీ భారతీయ వెర్షన్ లో సమంత అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో రక్తి కట్టించింది. తన కోస్టార్ గా నటించిన వరుణ్ ధావన్ కంటే సమంతకే ఎక్కువ గుర్తింపు కూడా దక్కింది. ఒక రకంగా సిటాడెల్ ని సామ్ హైజాక్ చేసిందని పలువురు విశ్లేషించారు. అదంతా అటుంచితే, సమంత తదుపరి స్టెప్ ఏమిటి? అంటూ అభిమానులు ఆసక్తిగా వేచి చూస్తున్నారు. ఇప్పటికే సొంత బ్యానర్ లో 'మా ఇంటి బంగారం' అనే సినిమాని నిర్మిస్తున్నట్టు ప్రకటించింది. అలాగే 'ఏమాయ చేశావే' సహా పలు చిత్రాలతో తనకు బలమైన పునాదిని ఇచ్చిన గౌతమ్ మీనన్



తో సినిమా చేస్తోందని కూడా ప్రచారమైంది. కానీ ఇవేవీ పట్టాలెక్కినట్టు సమాచారం లేదు. ఇలాంటి సమయంలో సమంత తన తదుపరి ఓటీటీ ప్రాజెక్ట్ పై మాత్రమే దృష్టి సారించనుందని భావిస్తున్నారు. రాజ్ అండ్ డీకే నిర్మిస్తున్న 'రక్త్ బ్రహ్మాండ్' సిరీస్ లో నటించడంపైనా సమంత దృష్టి సారిస్తోందా? రక్త్ బ్రహ్మాండ్ వెబ్ సిరీస్ చిత్రీకరణ గురించి కూడా ఇటీవల అప్ డేట్ లేదు. అయితే తన మాజీ భర్త నాగచైతన్య పెళ్లి తర్వాత సమంత తన స్నేహితురాళ్లతో కలిసి పార్టీ చేసుకుంది అంటూ వెబ్ లో కథనాలు వైరల్ అయ్యాయి. మరోవైపు సమంత వాణిజ్య ప్రకటనల ప్రచారం.. సోషల్ మీడియాల్లో హెల్త్ టిప్స్ ని అందించే పనిలో కూడా బిజీగా ఉంది. అందువల్ల సమంత నటించే తదుపరి సినిమా గురించి తెలుసుకోవడానికి కొంత సమయం పడుతుందని అభిమానులు వేచి చూస్తున్నారు.

**సల్మాన్ తో.. తాప్సీతో..?...** మయోసైటిస్ నుంచి కోలుకుని 'సిటాడెట్- హనీ బన్నీ'లో నటిస్తున్న సమయంలోనే బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ సరసన సమంత నటించనుందని కథనాలొచ్చాయి. అలాగే తాప్సీ పన్ను నిర్మించే సినిమాల్లోను సమంత నటించనుందని కొన్ని కథనాలు వైరల్ అయ్యాయి. కానీ ఇవేవీ నిజాలు కాదని ప్రూవ్ అయింది.



# రాజస్థాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి
## 11 నుంచి 13 వరకు ఇతర రాష్ట్రాల పర్యటన

హైదరాబాద్ : ఈ నెల 11 నుంచి 13 వరకు మూడు రోజులపాటు సీఎం రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాల పర్యటనకు వెళ్లనున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి రాజస్థాన్?లో సమీప బంధువు పెండ్లికి సీఎం హాజరుకానున్నట్టు తెలిసింది. మంగళవారం ఢిల్లీ వెళ్లి.. అక్కడి నుంచి రాజస్థాన్?కు బయలుదేరనున్నారు. అనంతరం మళ్లీ ఢిల్లీకి వచ్చి ఏఐసీసీ పెద్దలతోపాటు కేంద్ర మంత్రులను కలిసే అవకాశం ఉన్నది. ఇందుకోసం పీఎంతోపాటు కేంద్రమంత్రుల అపాయింట్?మెంట్? కోరినట్టు తెలిసింది. అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 16 వరకు వాయిదా పడిన నేపథ్యంలో.. పీసీసీ అధ్యక్షుడు, ఇతర ముఖ్య నేతలు కూడా సీఎంతోపాటు ఢిల్లీ వెళ్లే చాన్స్? ఉన్నది. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ, తదితర అంశాలపై పార్టీ హైకమాండ్‌తో చర్చించనున్నారు.

# రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శీతాకాల విడిది.. ఏర్పాట్లపై తెలంగాణ సీఎస్ సమీక్ష



హైదరాబాద్: శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హైదరాబాద్ రానున్నారు. డిసెంబరు 17 నుంచి 21 వరకు రాష్ట్రపతి హైదరాబాద్‌లో ఉండనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి శీతాకాల విడిది ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సీఎస్ శాంతికుమారి సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రాష్ట్రపతి పర్యటనకు ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతరం అందుబాటులో ఉండేలా ప్రత్యేక బృందాలను నియమించాలని అటవీ శాఖ ఉన్నాతాధికారులను సీఎస్ ఆదేశించారు.

బందోబస్తు, ట్రాఫిక్, అగ్నిమాపక, నిరంతర విద్యుత్ సరఫరా, రోడ్ల మరమ్మతులు, పరిసరాల పారిశుద్ధ్య నిర్వహణ చర్యలు పకడ్బందీగా చేయాలని వివిధ శాఖలను సీఎస్ ఆదేశించారు. సమావేశంలో హెూంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, డీజీపీ జితేందర్, ఆర్అండ్ బీ ప్రత్యేక సీఎస్ వికాస్ రాజ్, అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, సమాచార శాఖ ప్రత్యేక సీఎస్ హరీష్ తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.



# కాంగ్రెస్ తల్లిని తిరస్కరిస్తున్నాం

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం అన్యాయమని భారాస ఎమ్మెల్సీ కవిత అన్నారు. తెలంగాణ ప్రత్యేక పండుగ అయిన బతుకమ్మను తొలగించి.. హస్తం పార్టీ గుర్తును పెట్టడం దురదృష్టకరమని విమర్శించారు.

ప్రభుత్వ వైఖరికి నిరసనగా.. తెలంగాణ భవన్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి కార్యకర్తలతో కలిసి కవిత పాలాభిషేకం, పంచామృత అభిషేకం నిర్వహించారు. "ఉద్యమ కాలంలో పెద్దలు నిర్ణయించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. బతుకమ్మను విగ్రహంలో ఎందుకు చేర్చలేదు? తొమ్మిది మంది కళాకారులను సన్మానిస్తామన్నారు.. ఆ జాబితాలో మహిళలు ఎక్కడ? స్ఫూర్తి నింపే తెలంగాణ తల్లి విగ్రహం కాదని.. కాంగ్రెస్ తల్లిని పెట్టుకున్నారు. ఉద్యమకాలం నాటి ప్రతీకలను అవమానించే యత్నం చేస్తున్నారు. సచివాలయంలో పెట్టిన కాంగ్రెస్ తల్లిని తిరస్కరిస్తున్నాం" అని కవిత అన్నారు.




# ప్రజావాణి కార్యక్రమం

# ఎన్ని ఇబ్బందులొచ్చినా ప్రజావాణి కొనసాగిస్తాం: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్: ఎన్ని ఇబ్బందులొచ్చినా 'ప్రజావాణి' కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో కొనసాగిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులు పరిష్కారం అవుతున్నాయి. ప్రతి పౌరుడికి నమ్మకం కలిగేలా ప్రజావాణి నిర్వహిస్తున్నాం. ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రజల అవసరాలు తీర్చాలనేదే మా ప్రభుత్వ లక్ష్యం. మీ కోసమే మేం ఉన్నామనే భావన అధికారులు.. ప్రజలకు కల్పించాలి. రాజ్యాంగ పీఠికలోని లక్ష్యాలను ప్రజలకు అందించాలని ప్రయత్నిస్తున్నాం" అని భట్టి విక్రమార్క తెలిపారు.

# ఎంపీలు చర్చల్లో ఉంటే.. రాహుల్ తమాషాలు: కేంద్రమంత్రి

దిల్లీ: పార్లమెంటు ఆవరణలో ప్రధాని నరేంద్ర మోదీ, గౌతమ్ అదానీల ముసుగులు ధరించిన ఇద్దరు ఎంపీలతో రాహుల్ గాంధీ ఇంటర్వ్యూ నిర్వహించడంపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ ముందు తమాషా చేశారని మండిపడ్డారు. "రాహుల్‌కు ప్రజల బాధలు పట్టవు.. కానీ మిగిలిన ఎంపీలు అలా కాదు. తమను ఎన్నుకున్న ప్రజలపై వారికి కొన్ని బాధ్యతలు ఉన్నాయి. సమాజ్‌వాదీ, టీఎంసీ, రాజ్యసభలోని కాంగ్రెస్ ఎంపీలు, లోక్‌సభలోని కొందరు ఎంపీలకు పార్లమెంటు సమావేశాల్లో పాల్గొనాలని ఉంది. కానీ, రాహుల్ ప్రధానిని అవమానపరుస్తూ పార్లమెంటు వద్ద తమాషా చేశారు. ఆ తర్వాత విదేశాలకు వెళ్లి తన హాలిడేస్‌ను ఆస్వాదిస్తారు" అని కిరణ్ రిజిజు సోషల్ మీడియా వేదికగా దుయ్యబట్టారు. అదానీ అంశంపై చర్చకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నిరసనలు చేపడుతున్నా.. దీనికి సమాజ్‌వాదీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు దూరంగా ఉంటున్నాయని.. ఇందులోనే వారి ఆలోచనా ధోరణి ఎలా ఉందో అర్థమవుతోందని రిజుజు అన్నారు. 'ఇండియా కూటమి'లో చీలికలు వచ్చాయనడానికి ఇదే నిదర్శనమని అన్నారు. శీతాకాల సమావేశాలు మొదలైనప్పటినుంచి పార్లమెంటులో ప్రతిష్టంభన నెలకొన్న సంగతి తెలిసిందే. అదానీ వ్యవహారం, యూపీలోని సంభల్ అల్లర్లు తదితర అంశాలపై చర్చకు విపక్షాలు పట్టుపడుతుండటంతో గత వారమంతా సభా కార్యకలాపాలు స్తంభించాయి. అదానీ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చ జరపాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ కొన్ని రోజులుగా ఆందోళన చేస్తోంది. కాగా దీనికి సమాజ్‌వాదీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు దూరంగా ఉన్నాయి. సోమవారం మరోసారి పార్లమెంట్ ఆవరణలో విపక్ష నేతలు నిరసన చేపట్టారు. ప్రధాని మోదీ, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ పాత్రధారులను కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేశారు. ఇదిలాఉండగా.. జార్జ్ సోరోస్ ఫౌండేషన్‌కు కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీకి ఆర్థిక సంబంధాలున్నాయని భాజపా ఆరోపించడంతో పార్లమెంట్‌లో తీవ్ర దుమారం రేగింది.



# నా పోరాటం ఆస్తి కోసమో.. డబ్బు కోసమో కాదు

హైదరాబాద్: తాను ఆస్తి కోసమో, డబ్బు కోసమో పోరాటం చేయడం లేదని సినీనటుడు మంచు మనోజ్ అన్నారు. తనను తొక్కేయడానికి భార్య, పిల్లల అంశాన్ని తీసుకొస్తున్నారని ఆరోపించారు. కుటుంబ వివాదం నేపథ్యంలో జల్‌పల్లిలో మనోజ్ మీడియాతో మాట్లాడారు. "నేను చేసేది ఆత్మగౌరవ పోరాటం. ఇది నా భార్య, పిల్లల రక్షణకు సంబంధించిన విషయం. నన్ను అణగదొక్కేందుకు నా భార్యను బెదిరింపులకు గురిచేయడం.. నా ఏడునెలల పాపను దీనిలోకి లాగడం.. నా పిల్లలు ఇంట్లో ఉండగానే ఇలా ప్రవర్తించడం సరికాదు. పోలీసుల వద్దకు వెళ్లి రక్షణ కోరాను. నాకు అన్ని విధాలా రక్షణ కల్పిస్తామనే వారు నా మనుషులను బెదరగొట్టి వేరే వాళ్లని లోపలికి పంపించారు. నా మనుషులను ఇక్కడి నుంచి పంపించే అధికారం పోలీసులకు ఎక్కడిది? ఫిర్యాదు తీసుకున్న తర్వాత ఏకపక్షంగా ఎందుకు వ్యవహరిస్తున్నారు?నాకు మద్దతు కోసం ప్రపంచంలోని అందర్నీ కలుస్తా" అని మనోజ్ వ్యాఖ్యానించారు.

**రచ్చకెక్కిన మంచు కుటుంబం :** మంచు కుటుంబంలో జరుగుతోన్న వివాదం చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. మోహన్‌బాబు, మనోజ్ ఇద్దరూ పరస్పర ఆరోపణలు చేసుకుంటూ లేఖలు విడుదల చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు తమపై దాడి చేశారని, తనకు, తన భార్యకు ప్రాణహాని ఉందని పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో మంచు మనోజ్ సోమవారం ఫిర్యాదు చేశారు. మరోవైపు మనోజ్‌తో తనకు ప్రాణహాని ఉందని మోహన్‌బాబు లేఖ ద్వారా రాచకొండ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మంచు మనోజ్, ఆయన భార్య మౌనికపై కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో జల్‌పల్లిలోని నివాసంలో సన్నిహితుల సమక్షంలో మోహన్‌బాబు, విష్ణు, మనోజ్ మధ్య చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. మరోవైపు ఈ మొత్తం వ్యవహారంపై మంచు మనోజ్ సోమవారం రాత్రి ఎక్స్ వేదికగా పది అంశాలతో కూడిన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. పలు కుటుంబ అంశాలను ప్రస్తావించారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులను, తెలంగాణ డీజీపీని మనోజ్ తన పోస్ట్‌కు ట్యాగ్ చేశారు. ఈ విషయంలో చివరకు న్యాయమే గెలుస్తుందని విశ్వసిస్తున్నట్లు తెలిపారు.

**బౌన్సర్ల మధ్య ఘర్షణ..** చర్చల నేపథ్యంలో జల్‌పల్లిలోని మోహన్‌బాబు నివాసం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మంచు విష్ణు, మనోజ్ బౌన్సర్ల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది.



# ఆ పోలీసులను డిస్మిస్ చేయాలి

హైదరాబాద్: హామీల అమలుకు ఆశా వర్కర్లు ఆందోళన చేస్తున్నారని.. నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు దాడులు చేయడం హేయమైన చర్య అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. పోలీసుల దాడిలో గాయపడిన ఆశావర్కర్లను ఉస్మానియా ఆస్పత్రిలో పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. "కరోనా సమయంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ఆశావర్కర్లు సేవలందించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకు ఆందోళన చేపట్టారు. ఈ ఘటనపై మానవ హక్కుల సంఘం, మహిళా కమిషన్‌లో ఫిర్యాదు చేస్తాం. ఆడబిడ్డలపై చేయి చేసుకున్న పోలీసులను డిస్మిస్ చేయాలి. ఆశా వర్కర్ల తరఫున ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీస్తాం. వారికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకూ అండగా ఉంటాం" అని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆశ వర్కర్లకు స్థిర వేతనం రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల సంఘం (బీఆర్‌టీయూ అనుబంధం) ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఆందోళనలు ఉద్రిక్తతకు దారితీసిన విషయం తెలిసిందే.

# హైడ్రా కమిషనర్‌ను కలిసిన కామారెడ్డి ఎమ్మెల్యే.. 5 కంపెనీలపై ఫిర్యాదు



హైదరాబాద్, రెజిమెంటల్ బజార్: చెరువులను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతోన్న పలు కంపెనీలపై కామారెడ్డి భాజపా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి.. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని బుద్ధ భవన్‌లో రంగనాథ్‌ను కలిసిన ఎమ్మెల్యే.. పలు కంపెనీల పేర్లను ప్రస్తావిస్తూ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ అంశంపై ప్రభుత్వం స్పందించకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. రెండు నెలల క్రితమే చెరువుల కబ్జాపై తాను మాట్లాడినట్లు చెప్పారు. అయితే, తాను మాట్లాడిన 10 రోజుల తర్వాత.. అనుమతులు ఇచ్చిన నిర్మాణాల జోలికి వెళ్లబోమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లు తెలిపారు. "చెరువులు కబ్జా చేశారు. అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. 5 కంపెనీలకు అనుమతి ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి. ఈ ప్రభుత్వం గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ కొత్త నాటకానికి తెర లేపింది. ఈ 5 సంస్థల విషయంలో అక్రమంగా అనుమతులిచ్చిన అధికారులు, వాటికి అండగా ఉన్న ప్రభుత్వ పెద్దలపై చర్యలు తీసుకోవాలి. భూ ఆక్రమణలను అరికట్టేందుకు ప్రభుత్వం నూతనంగా చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది" అని ఎమ్మెల్యే అన్నారు.

# మార్చి నాటికి లక్ష ఎకరాల్లో పామాయిల్ ప్లాంటేషన్: మంత్రి తుమ్మల



హైదరాబాద్: వ్యవసాయ యాంత్రీకరణ, డ్రిప్ ఇరిగేషన్ పథకాల అమలును వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అధిక మొత్తంలో రైతులకు లబ్ధి చేకూర్చాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ రాష్ట్రస్థాయి అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. వివిధ పథకాల పురోగతిపై అధికారులతో మంత్రి విస్తృతంగా చర్చించారు. ప్రాథమిక సహకార సంఘాల బలోపేతంపైనా మంత్రి దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు తుమ్మల సూచించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి లక్ష ఎకరాల్లో పామాయిల్ ప్లాంటేషన్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని.. ఇందుకోసం అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

# వినూత్నమైన బ్యాగుతో పార్లమెంటుకు విపక్షాలు.. క్యూట్‌గా ఉందన్న రాహుల్

దిల్లీ: పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై వచ్చిన ఆరోపణల మీద జేపీసీ విచారణ జరపాలని విపక్షాలు డిమాండు చేస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో ప్రతిపక్ష నేతలు పార్లమెంటు ఆవరణలో దీనిపై వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్నారు. సోమవారం పార్లమెంటు ఆవరణలో అదానీ, ప్రధాని నరేంద్ర మోదీ మాస్కులతో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఇంటర్వ్యూ నిర్వహించిన విషయం తెలిసిందే. తాజాగా ప్రధాని, అదానీల చిత్రాలతో ఉన్న వినూత్నమైన బ్యాగులు ధరించి నిరసన తెలిపారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీతో సహా ప్రతిపక్ష నేతలు మంగళవారం పార్లమెంటుకు వినూత్నమైన బ్యాగ్‌ను ధరించి వచ్చారు. బ్యాగ్‌కి ఒకవైపు ప్రధాని నరేంద్ర మోదీ, పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీల చిత్రం, మరోవైపు 'మోదీ, అదానీ భాయ్ భాయ్' అనే నినాదం ముద్రించి ఉంది. ఈక్రమంలో ప్రియాంక వద్ద ఉన్న బ్యాగును రాహుల్ గాంధీ పరిశీలించారు. 'చూడండి ఎంత క్యూట్‌గా ఉందో' అని ఆయన పేర్కొన్నారు.

అనంతరం ఆ బ్యాగులు ధరించి పార్లమెంటు వెలుపల నిరసన వ్యక్తంచేశారు. సోమవారం సైతం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పార్లమెంటు ముఖద్వారం వెలుపల ప్రధాని మోదీ, అదానీల ముఖం మాస్కులను కొందరు ధరించారు. రాహుల్ గాంధీ వారి వద్దకువెళ్లి కొన్ని ప్రశ్నలు అడిగారు. దీనికి సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com